Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 80 పేజీలు 8 వెల : 5 శనివారం 13 సెప్టెంబర్ 2025






## రానున్న దశాబ్దకాలంలో
# మారనున్నరూపురేఖలు

ఖరిన చర్యలతో అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాం

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు

అమరావతిలో నిర్వహించినకాన్‌క్లేవ్‌లో చంద్రబాబు

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలలోపే ప్రభుత్వానికి నివేదికని ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం భావిస్తోంది. ఆ నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అయితే పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది. రెండు మూడు జిల్లాల ఏర్పాటుతో పాటు- కొన్ని చోట్ల హద్దులు మార్చే అవకాశం ఉందని సమాచారం. వైస్సార్సీపీ హాయాంలో పరిపాలన సౌలభ్యం కోసం 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. అయితే, ఇందులోని గందరగోళం ఉందని మార్పులు అవసరమని భావించింది ప్రస్తుత కూటమి ప్రభుత్వం.

2లో..

## మెడికల్ కాలేజీలు కట్టకుండానే
# ప్రచారం



2లో..

జగన్ హయాంలో వైద్య విద్య మరీ అధ్వానం

పిపిపి పద్ధతిలోనే కళాశాలల నిర్వహణ

తేల్చి చెప్పిన సిఎం చంద్రబాబు

జగన్ హయాంలో నిర్లక్ష్యంపై మండిపడ్డ అనిత

టెండర్లను రద్దుచేసే అధికారం లేదన్న సత్యకుమార్

తురకపాలెం సమస్యలపై ప్రత్యేక దృష్టి పరీక్షల నివేదికలు రాగానే చర్యలున్యూ రాజరాజేశ్వరి పేటలో అదుపులోడయేరియా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

## ఏపీలో ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు యోచన

తెలుగు సినిమా గ్లోబల్ అవుతోందన్న పవన్ కళ్యాణ్



న్యూఢిల్లీ: తెలుగు సినిమా ఇప్పుడు గ్లోబల్ సినిమా అవుతోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి, సినీనటు-డు పవన్ కల్యాణ్ అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ) కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎస్‌డీని చూస్తే మినీ ఇండియాలా దర్శనమిస్తోందని చెప్పారు. తనకు నటన నేర్పిన సత్యానంద్ ఎస్-ఎస్‌డీ గురించి గొప్పగా చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. కళలు లేకపోతే సమాజంలో హింస ప్రబలుతుందని వ్యాఖ్యానించారు. ఏపీలో ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు- చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. క్యాంపస్ ఏర్పాటు-పై సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని తెలిపారు.

## రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు

అన్ని రకాల ఎరువులు సరిపడా నిల్వలు
మరోమారు స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు



విజయవాడ: రాష్ట్రంలో ఎరువులకు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోమారు స్పష్టంచేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. విజయవాడలోని క్యాంప్ ఆఫీస్ లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సహా అన్నిరకాల

ఎరువులు సరిపడా నిల్వలుగా ఉన్నాయని తెలిపారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలను పరిశీలిస్తూ, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో ప్రతిరోజూ సమీక్షలు జరుగుతున్నాయని అన్నారు. మార్కెట్‌లో ఎరువుల కొరత లేకుండా, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే రైతుల సమస్యల పరిష్కారం మా మొదటి కర్తవ్యం అని మంత్రి స్పష్టం చేశారు. ఎరువుల కొరత పేరుతో రైతులను మోసం చేయాలనుకునే డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అచ్చెన్నాయుడు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు 24 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని సహకార సంస్థలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటు-లో ఉందని తెలిపారు. వివిధ పోర్టుల నుండి మరియు తయారీ సంస్థల నుండి 29,236, మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలకు రవాణా దశలో ఉందన్నారు. 1,06,412 మెట్రిక్ టన్నుల యూరియా పలు పోర్టులు, తయారీ సంస్థల ద్వారా రాష్ట్రానికి సెప్టెంబర్ నెలాఖరకు చేరుకుంటాయని అన్నారు. రైతుల అవసరాలను గుర్తించిన కేంద్రం రాష్ట్రానికి మరో 24,894 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారని, ఈనెల 15 తేదీ నుండి 22వ తేదీ లోపు విశాఖపట్నం పోర్టుకు యూరియా చేరుకుంటుందని తెలిపారు. ఈ యూరియా నిల్వలతో కరీఫ్ సీజన్ కు సరిపడా యూరియా అందరికి లభిస్తుందని, రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరయా కొరత అనే మాట వినిపించదన్నారు.



## సుప్రీంకోర్టు ఆవరణలో
# నిషేధాజ్ఞలు

రీల్స్ తదితర కార్యకలాపాల నిషేధం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోలు, రీల్స్ చేయడం, వీడియోలు తీయడంపై సర్వోన్నత న్యాయస్థానం నిషేధం విధిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. సెప్టెంబరు 10న జారీచేసిన ప్రకటనలో మీడియా సిబ్బంది ఇంటర్వ్యూలు, వార్తలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలను కేవలం భద్రతా ప్రమాణాలకు అనుగుణమైన జోన్‌లో మాత్రమే నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

## పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట పనులు

ఈసారి అక్కడే బతుకమ్మ ఉత్సవాలకు ప్లాన్

యాకుతుపురా ఘటనపై బాధ్యులపై చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



2లో..

# మూడు రాజధానులు కాదు..వికేంద్రీకరణ అన్నాం



విజయవాడ-గుంటూరు మధ్య రాజధానితో ఖర్చు తగ్గుతుంది

మాయాబజార్‌తో కోటరీ జేబులు నింపే పనిలో చంద్రబాబు

రాజధానిపై మాట మార్చిన వైకాపా నేత సజ్జల

అమరావాతి రాజధాని అమరావతిపై వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.. మూడు రాజధానులని అనలేదని, వికేంద్రీకరణ గురించే మాట్లాడామని మాట మార్చారు. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే ఖర్చు తక్కువ అవుతుందన్నారు.. అయితే, ఇంతకు ముందు అమరావతిని రాజధానిగా తీసేస్తామని మేం అనలేదన్నారు.. అమరావతిని కలుపుకొని డీసెంట్రలైజ్ అన్నాం.. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం అన్నాం.. మూడు రాజధానులు అని తప్పుడు ప్రచారం చేశారన్నారు.. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే శాశ్వత పరిష్కారం అవుతుందున్నారు.. చంద్రబాబు తాను, తన కోటరీ జేబులు నింపుకునే ఆలోచన చేస్తున్నారు.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు.. అమరావతిని మాయా బజారులాగా కట్టాలని అంటే లక్షల కోట్లు ఖర్చు అవుతుంది.. రాష్ట్రం భరించలేనంత ఖర్చు రాజధానికి అవుతుంది.. చంద్రబాబు రాజధానిని అప్పులు పాలు కాకుండా చూడాలని సలహా ఇచ్చారు. కేంద్రం రాజధానికి డబ్బు ఇస్తే ఎవరికి అభ్యంతరం లేదు.. కానీ, చంద్రబాబు లోను తీసుకోని రాజధాని కడుతున్నారని విమర్శించారు సజ్జల.. అమరావతిని జగన్ అభివృద్ధి చేశారన్న ఆయన... మేం పరిపాలన రాజధాని విశాఖ, న్యాయ రాజధాని కర్నూల్ అనుకున్నాం.. కానీ, మేం అనుకున్నది జరగలేదు.. అమరావతి ప్రాంతంలో రాజధాని కంటిన్యూ అవుతుందని కీలక వ్యాఖ్యలు చేశారు.. అయితే, రాజధాని నిర్మాణం చంద్రబాబు చేతిలో ఉంది.. రాజధాని పూర్తి కాకపోతే వేరే ఆలోచన వచ్చే అవకాశం ఉందన్నారు.. మరోవైపు, రాజధాని మీద శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు సజ్జల.. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే మహా

నగరం తయారు అవుతుంది.. 500 ఎకరాల్లో రాజధాని సరిపోతుందని వైఎస్ జగన్ గతంలోనే చెప్పారు.. ఈ ప్రాంతంలో ఇప్పటికే పశ్చిమ బైపాస్ అందుబాటులో ఉంది.. తూర్పు బైపాస్ కూడా అందుబాటు-లోకి వస్తుంది.. దగ్గరలోనే బందరు పోర్టు కూడా ఉంది.. ఇటువైపు అయితే త్వరగా ఒక మహానగరం రెడీ అవుతుందన్నారు సజ్జల.. చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ల్యాండ్ పూలింగ్ అంటున్నారు.. చంద్రబాబు లాండ్ పూలింగ్ అంటే అనుమానాలు వస్తున్నాయన్నారు సజ్జల.. లక్షల ఎకరాలు తీసుకుని ఏం చేస్తారు..? అని ప్రశ్నించారు.. రాజధాని కంటిన్యూ చేయడం చంద్రబాబు చేతిలోనే ఉందన్నారు.. రాజధాని పనులు త్వరగా పూర్తి చేస్తే కొత్త ఆలోచనలు రావు.. రాజధాని కాకపోయినా అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తాం అన్నారు వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి..



2లో..

# డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం

ఇదన ధరల దృష్ట్యా ప్రయోగం

కేంద్రమంత్రి గడ్కరీ వెల్లడి

# రానున్న దశాబ్దకాలంలో మారనున్నరూపురేఖలు




అమరావతి:భారతదేశానికి నాలుగోసారీ ప్రధానిగా నరేంద్రమోదీనే ఉంటారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. వచ్చే దశాబ్దంలో ఏపీతోపాటు, దేశంలో అద్భుతాలు జరుగు తాయని ఆయన అన్నారు. ఒక సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయనే అంశాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నా. 1999లో గెలిచా. 1999 ప్రభుత్వం వచ్చాక ఓ తపనతో పని చేశా. కొంచెం బ్యాలెన్స్ చేయలేకపోయాం. కానీ ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు అందిస్తున్నాం. భారత ప్రధానిగా నాలుగోసారి కూడా మోదీనే వస్తారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుంది. ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఏపీలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం అని సీఎం చంద్రబాబు అన్నారు. విజన్ రూపకల్పన చేయడమే కాదు.. దాన్ని సాధ్యం చేసే దిశగా పని చేయాలని ఆయన సూచించారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047, రాష్ట్ర స్థాయిలో
స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లను సిద్ధం చేశామని తెలిపారు. భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్ స్టాపబుల్ గా మారింది. 2038 నాటికి భారతదేశం నెంబర్-1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నానని అన్నారు.

# ఉపరితల ఆవర్తనంతో బంగాళాఖాతంలో అల్పపీడనం

**తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం**

**మానేరు వాగులో చిక్కుకు పోయిన ట్రాక్టర్లు**

**హైదరాబాద్ మూసీకి వరదపోటు**



హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న రెండురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. ఆదివారం వరకు మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. వర్షాల ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే వీలుందని తెలిపింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మానేరు వాగుకు ఇంతకింతకూ పెరుగుతూ భయంకరంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం ఇసుక కోసం వెళ్లిన ట్రాక్టర్లు మానేరు వరదలో చిక్కుకున్నాయి. ఎనిమిది ట్రాక్టర్లు వరదల్లో చిక్కుకోవడంతో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిల్లపల్లి- ఒడేడ్ గ్రామాల మధ్య గల మానేరు వాగులోకి ఇసుకకోసం వెళ్లిన 8 ట్రాక్టర్లు వరదలో చిక్కుకున్నాయి. మొదట అంతగా వరద లేకపోవడంతో ఇసుకను తవ్వుతూ ఉన్నారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగటంతో ట్రాక్టర్లను అక్కడే వదిలేసి డ్రైవర్లు, కూలీలు వెంటనే బయటకు పరుగెత్తారు. ప్రవాహం పెరుగుతుండటంతో పరిస్థితి భయంకరంగా తయారైంది. వరద ఉధృతికి ట్రాక్టర్లు ఒరిగి పోయిన దృశ్యాలు ఆంతోళన కలిగిస్తున్నాయి. అయితే ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు పోలీసులు. వెంటనే అక్కడికి చేరుకుని సిబ్బందితో కలిసి సహాయక చర్యలు స్థానిక పోలీసులు చేపట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద పోటెత్తడంతో ఉస్మాన్ సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో జలమండలి అధికారులు గండిపేట జలాశయం ఆరు గేట్లను నాలుగు అడుగుల మేర పైకి ఎత్తి 2652 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న మూసీలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి 2000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. మరోవైపు గేట్లు- ఎత్తడంతో మూసీలో వరద ఉధృతి మరింత పెరిగింది. నార్సింగి, మంచిరేవుల మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి ఈ వరద నీరు ప్రవహించడంతో అధికారులు ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. మూసీలో వరద ప్రవాహం అధికంగా ఉండటంతో మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు లోతట్టు- ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ పరిధిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. న్యాళ చెరువు, ఆకునూరు ఊర చెరువు సహా పలు కుంటలు వరదనీటితో నిండిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. సోమారంలో ఆదర్శ పాఠశాల పరిసరాలు జలమయమయ్యాయి. అక్కడి వసతి గృహం చుట్టూ మోకాలి లోతు నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బొమ్మకల్ వద్ద కల్వర్టుపై వరద ఉధృతి అధికంగా
ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెనుకేపల్లి తుమ్మలచెరువు మత్తడి పడుతుండడంతో అటు-వైపు రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటు-న్నారు. మరో మూడు రోజుల పాటు- భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైదాపూర్ తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్సై తిరుపతి కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రాత్రి సైదాపూర్‌లో 102 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు- అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షానికి వాగులు, కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని ఇందిరాసాగర్ నిండుకుండలా మారి అలుగు పోస్తోంది. మజీద్‌పూర్, గుంతపల్లి గ్రామాల మధ్య ఏరులో వరద నీరు ఉరకలేస్తోంది. కల్వర్టు మీదుగా వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

**రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము**

**హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు**



న్యూఢిల్లీ: భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు-, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ పనిచేశారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా చేశారు. అభిమానులు ఆయనను తమిళనాడు మోదీగా పిలుస్తారు.

# ఏపీలో కొత్త జిల్లాలపై కసరత్తు

**మార్పులు, చేర్పులపైనా ప్రజాభిప్రాయ సేకరణ**

**ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే నివేదిక సమర్పణ**

అమరావతి: ఏపీలో కొత్త జిల్లాలపై కసరత్తు వేగవంతమైంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలలోపే ప్రభుత్వానికి నివేదికని ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం భావిస్తోంది. ఆ నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకొనుంది. అయితే పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది. రెండు మూడు జిల్లాల ఏర్పాటుతో పాటు- కొన్ని చోట్ల హద్దులు మార్చే అవకాశం ఉందని సమాచారం. వైస్సార్సీపీ హాయాంలో పరిపాలన సౌలభ్యం కోసం 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. అయితే, ఇందులోని గందరగోళం ఉందని మార్పులు అవసరమని భావించింది ప్రస్తుత కూటమి ప్రభుత్వం. ఇందులో భాగంగా కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు- మండలాలు గ్రామాల సరిహద్దులు పేర్ల మార్పు సర్దుబాట్లపై అధ్యయనానికి ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు- చేసింది. ఈ సబ్ కమిటీ- ఇప్పటికే ప్రజలు ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించింది. అంతేకాకుండా వినతలను కూడా స్వీకరించింది. వీటన్నిటిపై త్వరలో ఉపసంఘం చర్చించి అసెంబ్లీ సమావేశాలకు ముందే ప్రభుత్వానికి నివేదికను
ఇవ్వనుంది. కేంద్రం జనగణన చేయనున్నడంతో 2026 నుంచి 27 వరకు జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు పేర్లు మార్చేందుకు వీలుండదు. కాబట్టి, 2025 డిసెంబర్ 31 లోపు జిల్లాల పునర్విభజన హద్దుల్లో మార్పులు చేర్పులు పూర్తి చేసి అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ప్రకాశం జిల్లా మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు- చేయాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, ఎర్రగుణపాలం, దర్శి కలిపి ఐదు నియోజక వర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు- చేసే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉంది.అలాగే బాపట్ల జిల్లాలోని అద్దంకి నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజక వర్గాలని మళ్ళీ ప్రకాశం జిల్లాలో కలిపితే అక్కడి ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఇక అమరావతి కేంద్రంగా కొత్తగా అర్బన్ జిల్లా ఏర్పాటు- ప్రతిపాదన కూడా ఉంది. రాజధాని పరిధిలోని 29 గ్రామాలు గుంటూరు జిల్లా మంగళగిరి, తాడికొండ నియోజక వర్గాల్లోకి వస్తాయి. వీటితో పాటు- పెదకూరుపాడు, నందిగామ, జగ్గయపేట నియోజక వర్గాలు భౌగోళికంగా అమరావతికి దగ్గరగా ఉంటాయి. వీటితో కొత్త అర్బన్ జిల్లా ఏర్పాటు చేస్తే ఐదు నియోజక వర్గాలు అయ్యే అవకాశం ఉంటుంది. ఇక గుంటూరు జిల్లాలోనూ గుంటూరు తూర్పు, పశ్చిమ, పత్తిపాడు, పొన్నూరు, తెనాలి కలిపి ఐదు నియోజక వర్గాలు అవుతాయి. ప్రస్తుతం కృష్ణా జిల్లాలో ఉన్న గన్నవరం పెనమలూరు నియోజక వర్గాలని ఎన్టీఆర్ జిల్లాలో కలపొచ్చు. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు, పశ్చిమ, మధ్య, తిరువూరు, మైలవరం, గన్నవరం, పెనమలూరు సహా ఏడు నియోజక వర్గాలు అవుతాయి. కృష్ణా జిల్లాలో ఐదు నియోజక వర్గాలు ఉండే అవకాశం ఉంది.

# మెడికల్ కాలేజీలు కట్టకుండానే ప్రచారం




అమరావతి:జగన్ మెడికల్ కాలేజీలు కట్టకుండా... కట్టేశామని చెబుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. తాము ప్రైవేట్ వారికి అప్పగించడం లేదని .. పీపీపీ పద్ధతిలోనే చేపడుతున్నామన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, నిర్వహణ ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పారు. వైద్య విద్యార్థులకు, వైద్య సేవలకు ఇబ్బంది రాకుండా చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. బెదిరిస్తే బెదిరిపోయే పరిస్థితి లేదని తెలిపారు. ఒకప్పుడు రాయలసీమలో పదేళ్లలో 8 ఏళ్లు కరవు ఉండేదన్నారు. దేశంలో ఇప్పటికీ అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా అనంతపురం.. కానీ నీళ్లు ఇవ్వడంతో అక్కడ పరిస్థితి మారిందన్నారు. గోదావరి జిల్లాల కంటే అనంతపురం జిల్లానే జీఎస్‌డీపీలో అగ్రస్థానంలో ఉందన్నారు. హార్టీకల్చర్ సాగు వల్లే ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. వృథా జలాలను మాత్రమే బనకచర్లకు
వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలావుంటే గతంలో జగన్ శంకుస్థాపన చేసిన వైద్య కళాశాలలన్నీ పునాదుల దశలోనే ఉన్నాయని, మొండి గోడల మధ్య వైద్య విద్యార్థులు చదువుకుంటారా? అని ఏపీ హోం మంత్రి అనిత మండిపడ్డారు. పునాదుల దశలోనే వైద్య కళాశాలలు ఉంటే.. అడ్మిషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. విజయవాడలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో.. మెడికల్ కాలేజీలపై వైకాపా నేతలు చేస్తున్న విమర్శలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత వైకాపా ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. నోటికొచ్చినట్లు- జగన్ అబద్ధాలు చెబుతున్నారు. వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.5,800 కోట్లు- అవసరం. కానీ, ఐదేళ్లలో జగన్ ఖర్చు చేసింది కేవలం రూ.1,450 కోట్లే. పీపీపీ విధానం అంటే జగన్ ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదు. ఈ విధానంలో వైద్య కళాశాలలు నిర్మించి, మౌలికవసతులు కల్పిస్తారు. నిర్వహణ మొత్తం ప్రభుత్వమే చేపడుతుంది. కళాశాలలు తొందరగా నిర్మించాలనే ఉద్దేశంతోనే ఈ విధానం తీసుకొచ్చాం అన్నారు. జగన్ చేసిన పాపం వల్ల.. వైద్య విద్య అడ్మిషన్లు తీసుకురాలేక పోయాం. పీపీపీ విధానంలో టెండర్లు వేసేందుకు ముందుకొస్తే జగన్ బెదిరిస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మళ్లీ అధికారం లోకి వస్తామని జగన్ పగటి కలలు కంటున్నారు. ఆహా అంటున్న వైద్య కళాశాలలు ఎక్కడున్నాయో చెబితే.. జగన్‌ను నేనే అక్కడికి తీసుకెళ్తా. ఆయన ఆహా అంటారో.. ఓహో అంటారో చూద్దామని అనిత అన్నారు. వైకాపా హయాంలో ఐదేళ్లలో వైద్యకళాశాల భవన నిర్మాణాలను పూర్తిచేయకుండా జగన్ నిద్రపోయారని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. వైకాపా నేతలు ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైద్యకళాశాలకు భవనాలు నిర్మించక పోవడంతో వేలాది మెడికల్ సీట్లను విద్యార్థులు కోల్పోయారని చెప్పారు. లక్షలాది మందికి వైద్యం అందలేదని ఆక్షేపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వైకాపా అసత్య ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణ టెండర్లు రద్దు చేస్తానని జగన్ ప్రకటించడం దారుణమని.. అలా రద్దు చేయడం ఎవరి తరమూ కాదన్నారు.

# పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట పనులు



హైదరాబాద్: బతుకమ్మ కుంట పనులు పూర్తి కావొస్తున్నాయని, త్వరలో సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తాం అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నార . ఈసారి బతుకమ్మ పండుగ అక్కడే నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం అని కమిషనర్ తెలిపారు.సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదన్నారు. ఇకపోతే యాకుత్‌పురాలో ఐదేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తూ ప్రమాదవశాత్తూ మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఘటనపై హైడ్రా స్పందించింది. అయితే ఘటనపై వెంటనే గమనించిన బాలిక నాయనమ్మ, స్థానికులు సురక్షితంగా కాపాడారు. హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. యాకుత్‌పురా ఘటనపై రాజకీయపరంగా చేసే విమర్శలపై స్పందించను. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం అన్నారు. హైడ్రా వల్లే తప్పు జరిగిందని గుర్తించామని, ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్‌పై ఆడిట్ చేస్తున్నాం. మూతలు సరిగాలేనివి గుర్తించి.. సంబంధిత ఏజెన్సీకి సెక్రటరీ ద్వారా రిఫర్ చేస్తాం. జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదు. బ్లేమ్ గేమ్ కాకుండా సమన్వయంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ ఇన్‌ఛార్జి ఈ ఘటనకు బాధ్యుడు.. అతనిపై చర్యలు తీసుకుంటాం. ఆ చుట్టుపక్కల నాలుగైదు మ్యాన్ హోల్స్ ఉన్నాయి.. అందులో ఒకటి వాటర్ బోర్డు వాళ్లు క్లీన్ చేశారు. ఘటన జరిగిన మ్యాన్ హోల్ మాత్రం హైడ్రా సిబ్బంది క్లీన్
చేశారు. మంచి చేస్తేనే మా ఖాతాలో వేసుకోవడం కాదు.. తప్పు జరిగినప్పుడు కూడా అంగీకరిస్తున్నాం. ఇతర శాఖలతో చిన్న చిన్న సమస్యలు తప్ప పెద్ద ఇబ్బందులు లేవు. జీహెచ్ఎంసీ పెద్ద ఆర్గనైజేషన్.. మేము ఎవరిపై పెత్తనం చెలాయించట్లేదు. మా అందరికీ బాస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారు. మా శాంక్షన్ అయిన బడ్జెట్‌లో 3 నెలలది మాత్రమే రిలీజ్ అయింది. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేస్తాం.

# డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం



న్యూఢిల్లీ: దేశంలో ఇంధన దిగుమతుల ఖర్చును తగ్గించేందుకు ఇథనాల్ కలుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇ20 పెట్రోల్ వాడకం గురించి వాహనదారుల్లో ఉన్న అపోహలపై కేంద్రం క్లారిటీ- ఇచ్చింది. అయితే తాజాగా ఇథనాల్‌కు బదులుగా ఐసోబుటనాల్‌ను డీజిల్‌లో కలపనున్నట్లు- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. డీజిల్‌లో ఇథనాల్‌ను కలిపే ప్రయోగం విజయవంతం కాలేదని.. అందువల్ల దానికి బదులుగా ఐసోబుటనాల్ మెరుగైనది గుర్తించినట్లు- చెప్పారు. డీజిల్‌లో ఇథనాల్ మిక్స్ చేసినప్పుడు ఇంజిన్ సమస్యలతో పాటు- కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని చెప్పారు. బయోఫ్యూయల్ మిక్సింగ్ విదేశీ కరెన్సీని ఆదాచేయటంతో పాటు- భారీ ఫ్యూయెల్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. పెట్రోల్ లో ఇథనాల్ మిక్సింగ్ పై సోషల్ మీడియాలో తనపై కావాలనే తప్పుడు ప్రచారం కొనసాగించాలని గడ్కరీ ఇటీవల అన్నారు. అవి పూర్తిగా పెట్రోల్ లాబీ స్పాన్సర్ చేసిన పెయిడ్ ప్రచారం అన్నారు గడ్కరీ. ఊ20 ఇంధనానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం రాజకీయంగా ప్రేరేపించబడిందని అన్నారు. ఇథనాల్ వల్ల వాహనాల ఇంజన్లు పాడవుతాయనం పూర్తిగా నిరాధారమైనదిగా కొట్టిపడేశారు. కానీ కొందరు నిపుణులు మాత్రం ఇథనాల్ వల్ల పాత వాహనాల్లో ఇంజిన్లో తుప్పు, రబ్బర్ భాగాలు పడవటం జరుగుతుందని అంటున్నారు. మైలేజ్ కూడా దెబ్బతింటు-ందని చెబుతున్నారు. ప్రస్తుతం డీజిల్ విషయంలో ఐసోబుటనాల్ కలపాలనుకోవటానికి కారణం అందులో ఇథనాల్ కంటే ఎక్కువ ఎనర్జీ ఉండటమే. డీజిల్‌లో కలిపినప్పుడు ఇంజిన్ పనితీరు మెరుగుపడి కాలుష్యం కూడా తగ్గినట్లు- గుర్తించారు. ఇథనాల్ మాదిరిగానే ఐసోబుటనాల్ కూడా చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారు చేస్తారు. ఇక్కడ అసలు సమస్య ఏంటంటే ఐసోబుటనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడమే. దీని శుద్ధికి కర్మాగారాలకు నూ టెక్నాలజీ అవసరం ఉందని తెలుస్తోంది.

ఉత్తేజిత దినపత్రిక


# తిరుపతిలో జరిగిన రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దుతామని హామీ**

**మైస్ టూరిజం సెంటర్ గా తిరుపతి..స్థానిక అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి కృషికి చర్యలు.. డెస్టినేషన్ వెడ్డింగ్ లకు శ్రీకారం చుట్టేలా సదుపాయాలు కల్పిస్తామని వెల్లడి**

**టీటీడీతో కలిసి పర్యాటకంగా కొన్ని కార్యక్రమాలు చేపడితే బాగుంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ ప్రకటన**

**ఏడాది కాలంలో పర్యాటక రంగంలో దాదాపు రూ.12,000 కోట్ల పెట్టుబడులు సాధించామని హర్షం.. పర్యాటక అధికారులపై ప్రశంసల జల్లు కురిపించిన మంత్రి దుర్గేష్**

**గత ప్రభుత్వ హయాంలో పర్యాటక పెట్టుబడులు శూన్యం అని విమర్శ**

**పెట్టుబడులతో రండి అని పర్యాటక పెట్టుబడిదారులకు మంత్రి దుర్గేష్ ఆహ్వానం**

**తిరుపతి:, ఉత్తేజిత ప్రతినిధి, సెప్టెంబర్ 12.**





తిరుపతిని యాంకర్ హబ్ గా చేసి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం, ప్రైవేట్ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా శుక్రవారం తిరుపతిలోని తాజ్ హెూటల్ లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన రీజనల్ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్రంలో జరుగుతున్న పర్యాటక రంగ అభివృద్ధి, పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, పర్యాటక రంగానికి పారిశ్రామిక హెూదా కల్పన, నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక భూ కేటాయింపుల విధానం తదితర పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని, పర్యాటకంగా తిరుపతిలో ఉన్న అవకాశాలను వివరించారు.అదే విధంగా మంత్రి దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాట లు కొత్త పెట్టుడుల ప్రతిపాదన, తిరుపతిని కొత్త ఎంఐసీఈ గమ్యస్థానంగా ప్రోత్సహించడం, కారవాన్ టూరిజం, హౌస్ బోట్లు, హెూమ్ స్టే, అడ్వెంచర్ టూరిజం, ఎక్స్ పీరియన్స్ సెంటర్స్ తో టూర్ ప్యాకేజీల అనుసంధానం, టూరిజం కొత్త పాలసీపై సమ్మిట్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ ఇన్వెస్టర్స్ తో, హెూమ్ స్టే ఆపరేటర్స్ తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. పర్యాటక రంగ ఉన్నతాధికారులు, ఇతర అధికారుల పనితీరును మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు.పెట్టుబడిదారులకు సరైన మార్గదర్శకత్వం అందించేందుకు టూరిజం టీమ్ నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఏడాది కాలంలోనే దాదాపు రూ.12,000 కోట్లు పర్యాటక పెట్టుబడులు సాధించామంటే ఇన్వెస్టర్లలో ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఇది సామాన్యమైన విషయం కాదన్నారు. ఈ సందర్భంగా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టేందుకు పెట్టుబడులతో రండి అని పర్యాటక పెట్టుబడిదారులకు మంత్రి దుర్గేష్ ఆహ్వానం పలికారు.కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో టెంపుల్ టూరిజంకు ప్రఖ్యాతి గాంచిన తిరుపతి లాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించి ప్రసంగించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడలో ఈ తరహా రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లు నిర్వహించి స్థానికంగా పర్యాటక రంగంలో ఉన్న అవకాశాలను వెల్లడించామన్నారు. తద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను పెట్టుబడులకు ఆహ్వానించామన్నారు. ఇప్పటికే కొన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు గుర్తుచేశారు.

రాయలసీమలో ప్రత్యేకించి తిరుపతిలో టెంపుల్ టూరిజంతో పాటు స్థానికంగా ఉన్న ప్రకృతి సౌందర్య ప్రాంతాలను, వాటర్ ఫాల్స్, టైగర్ రిజర్వ్, పర్యాటకులను ఆకర్షిస్తోన్న వివిధ పర్యాటక ప్రదేశాలను, పురాతన కట్టడాలు, చారిత్రాత్మక కోటలకు విస్తృత ప్రచారం కల్పించి మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. అంతేగాక వీటన్నింటిని కలిపి టూరిజం సర్క్యూట్ గా చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. అందులో భాగంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో విశాఖపట్టణం, అరకువ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలో యాంకర్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. పీపీపీ విధానంలో చేపట్టే పర్యాటక అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.ఒకరోజు తిరుపతి దర్శనానికి వచ్చే భక్తుడు.. యాత్రికుడుగా మారి రెండు మూడు రోజులు ఇక్కడే ఉండి సమీపంలోని ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. అందులో భాగంగా చంద్రగిరి పోర్ట్, శ్రీ వెంకటేశ్వర జువాలాజికల్ పార్క్, తలకోన జలపాతం, ఫ్లెమింగో ఫెస్టివల్ జరిగిన సూళ్లూరుపేట, నేలపట్టులోని పక్షుల విహార కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా పర్యాటక పురోగతితో పాటు ఉపాధి అవకాశాలను బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. స్థానిక పర్యాటకులతో పాటు ఇతర ప్రాంత పర్యాటకులను ఆకర్షించే అంశంపై దృష్టిసారించామన్నారు.గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పర్యాటక రంగం కుంటుపడటంతో ఏపీ నుండి ఇతర ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లేవారని, కూటమి ప్రభుత్వంలో ఇతర ప్రాంతాల నుండి పర్యాటకులు రాష్ట్రానికి వచ్చేలా చేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ క్రమంలో పర్యాటకుల వసతికి అవసరమైన స్టార్ హెూటళ్లు, రిసార్ట్ లు, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. తిరుపతిని వ్యూహాత్మక పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం భావిస్తుందన్నారు. తిరుపతి నుండి సమీప ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక పెట్టుబడిదారులను ఆహ్వానించామన్నారు. అందులో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ద్వారా రూ.3482 కోట్ల విలువైన హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు కేబినెట్ లో ఆమోదం లభించిందన్నారు. తద్వారా హెూటళ్లలో 2698 రూమ్ లు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. అంతేగాక దాదాపు 11,645 మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇప్పటిదాకా రాష్ట్ర పర్యాటక రంగంలో రూ.10,280 కోట్ల పర్యాటక పెట్టుబడులు వచ్చాయన్నారు. తద్వారా 1466 రూమ్ లు ఏర్పాటు కానున్నాయన్నారు. వీటన్నింటిని గ్రౌండింగ్ చేస్తున్నామన్నారు.తిరుపతి సమీపంలో అట్ మోస్ఫియర్, నోవాటెల్, మారియట్, ఒబెరాయ్, లెమన్ ట్రీ, మహేంద్ర తదితర సంస్థలు రిసార్ట్స్, హెూటళ్లు నిర్మించేందుకు ఎంఓయూలు చేసుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. దుబాయ్ తరహాలో మీటింగ్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్ (మైస్) టూరిజంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తిరుపతిలో డెస్టినేషన్ వెడ్డింగ్ లు సైతం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో కలిసి పర్యాటకంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టగలిగితే డెస్టినేషన్ వెడ్డింగ్ కు అవసరమైన కళ్యాణ మండపాలు, సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నామన్నారు.సీఎం చంద్రబాబునాయుడు అన్నట్లుగా క్యారవాన్ టూరిజంకు విస్తృత స్పందన వస్తోందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీలో క్యారవాన్ టూరిజం ఏర్పాటు చేయనున్నామన్నారు. తద్వారా పర్యాటకులకు వసతి సౌకర్యం కలుగుతుందన్నారు. రాయలసీమలోని శేషాచలం అడవుల్లో అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ తదితర ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నామన్నారు. ఎర్రచందనం లభిస్తున్న ఈ ప్రాంతంలో ఎక్స్ పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా తర్వాత అత్యధిక అడవులున్న ప్రాంతంగా పేరుగాంచిన తిరుపతి అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. అటవీ శాఖతో ఈ విషయమై సమన్వయం చేసుకుంటామన్నారు. పర్యాటక అభివృద్ధి చేపట్టేందుకు ఇబ్బందులు లేకుండా పర్యాటక, అటవీ, దేవాదాయ, ఇరిగేషన్ శాఖలు సమన్వయం చేసుకునేలా సీఎం చంద్రబాబునాయుడు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు.రాష్ట్రంలో 10,000 హెూమ్ స్టేలు తీసుకొచ్చేందుకు హెూమ్ స్టే పాలసీని తదుపరి కేబినెట్ లో ఆమోదింపజేస్తామన్నారు. పాలసీ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కేబినెట్ లో ఆమోదం పొందిన అనంతరం పోర్టల్ ను రూపొందిస్తామన్నారు. కోనసీమలో మండువా లోగిళ్లలో ఉండేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. అదే తరహాలో తిరుపతిలో పాతకాలం నాటి ఇళ్లలో, పురాతన కట్టడాలలో హెూమ్ స్టేలు ఏర్పాటు చేస్తామన్నారు. విదేశీ పర్యాటకులు హెూమ్ స్టే లలో ఉండేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తారని తెలిపారు.

స్పష్టమైనప్రతిపాదనలతో, ఆలోచనతో పర్యాటక అభివృద్ధి చేపట్టేందుకు ముందుకు వచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అవసరమైన భూమి, రాయితీలు,ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు. ఇన్వెస్టర్లపై భారం పడకుండా తక్కువ ఖర్చుయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.గడిచిన ఐదేళ్ల కాలంలో పర్యాటక మంత్రి పర్యాటక అభివృద్ధి చేయలేకపోవడం వల్ల పర్యాటక రంగం కుంటుపడిందన్నారు. పర్యాటకాన్ని పట్టించుకోకపోవడం వల్ల రతనాలసీమగా ఉండాల్సిన రాయలసీమ ఎలా మారిందో చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక పెట్టుబడులు శూన్యమన్నారు. రుషికొండను మాత్రం రాజప్రాసాదంగా తీర్చిదిద్దారన్నారు.కార్యక్రమంలో హెూమ్ స్టే,పర్యాటక పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ఎండీ ఆమ్రపాలి కాట ఇన్వెస్టర్లకు వివరించారు.. స్టాంప్ డ్యూటీ రీయింబర్స్ మెంట్, ల్యాండ్ కన్వర్షన్ చార్జీలు, క్వాలిటీ సర్టిఫికేషన్, పవర్ చార్జీలు, జీఎస్టీ తదితర అంశాలను వివరించారు. ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట,జిల్లా అధికార యంత్రాంగం, నరసింహ యాదవ్, సుగుణమ్మ,డా.పసుపులేటి హరిప్రసాద్, టూర్ ఆపరేటర్స్ అసోయేషన్ అధ్యక్షులు విజయ్ మోహన్, సీఐఐ దామోదర నాయుడు, ఔత్సాహిక ఇన్వెస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# బుట్టా రేణుక నిజాలు తెలుసుకొని మాట్లాడండి

**ఫేక్ ప్రచారానికి కేరఫ్ వైసీపీ**

**5 ఏళ్లలో వంద పడకల ఆసుపత్రి పూర్తి ఎందుకు చేయలేదు**

**వైసీపీ తప్పిదం వల్ల పరికరాలు సక్రమంగా లేవు**

**డెలివరీలో ఎమ్మిగనూరుకు మొదటి స్థానం**

**సూపర్ సిక్స్ 90 శాతం అమలు చేశాం**

**ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర రెడ్డి**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 12 శుక్రవారం ప్రభుత్వం ఆసుపత్రి గురించి మాజీ ఎంపీ, వైసీపీ ఇంచార్జి బుట్టా రేణుక నిజాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే నివాసంలో శు క్రవారం (12-09-2025) తేదీ జనసేన పార్టీ ఇంచార్జి రేఖ గౌడ్, బీజేపీ నాయకులు నరసింహులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఫేక్ ప్రచారాలకు కేరఫ్ వైస్సార్సీపీ అని, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచికి తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా పని పెట్టుకుందన్నారు. బుట్టా రేణుక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సరిగ్గా లేరని, పరికరాలు సక్రమంగా లేవనడం వద్దూరంగా ఉందన్నారు. నాబార్డ్ నిధులు కింద టిడిపి హయాంలో 100 పడకల ప్రభుత్వాసుపత్రి మంజూరు చేశారని, కానీ వైసీపీ ఐదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేకపోయారని సూటిగా ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆసుపత్రిలో ఓపి గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త ఆసుపత్రిలో పరికరాలు మార్చుడానికి సమయం పడుతుందని దాన్ని దృష్టిలో పెట్టుకొని పరికరాలు సక్రమంగా లేవని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఇంకా కావాల్సిన సౌకర్యాల గురించి తాను అసెంబ్లీలో చర్చిస్తానని తెలిపారు. గతంలో వైసిపి తప్పిదం వల్ల పరికరాలు సక్రమంగా లేవని చెప్పారు. క్రిటికల్ కేర్ కొరకు కేంద్రం కు ప్రతిపాదన పంపామని, మనకు నేషనల్ హైవే ఉంటేనే ఈ కేర్ మంజూరు అవుతుందని అందువలన మొదటగా నేషనల్ హైవే పనులు ప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. ఎమ్మిగనూరు ఆసుపత్రి డెలివరీలో రాష్ట్రంలోనూ మొదటి స్థానం నిలిచిందని, మొన్నటి రోజు జుబేదా అనే మహిళకు ప్రసవంలో ఐదు కేజీల బాలుడు సజావుగా డెలివరీ చేయడం వైద్యుల మంచి పనితనం అన్నారు. చెప్పిన మాటలు విని వాస్తవాలు తెలుసుకోకుండా బుట్టా రేణుక మాట్లాడుతున్నారన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ 90 శాతం మేరా అమలు చేసిందని విజయోత్సవ సభ దిగ్విజయంగా చేశామన్నారు. మంత్రి నారా లోకేష్ సభకు హాజరు కాకుండా నేపాల్ లో చిక్కుకున్న తెలుగు వాడి కోసం సురక్షితంగా మన ప్రాంతానికి తీసుకురావడానికి చేసిన కృషి ఫలితంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. మాజీ సీఎం జగన్ తమ హయాంలో మెడికల్ కాలేజీలు పూర్తి చేశామని చెప్పడం చూస్తుంటే మన కర్నూలు జిల్లాలోని ఆదోని దగ్గర ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ పూర్తి అయ్యిందా అంటూ సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వైసిపి అడ్డు తగులుతుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల కన్వీనర్లు, పట్టణ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్.కొట్టాల గ్రామంలో 6 ఇళ్లలో దొంగలు చోరీ భయాందోళనలో గ్రామస్తులు

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి :**

బేతంచెర్ల మండలం పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఒకేసారి 6 ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు.గ్రామానికి చెందిన బోయపాటి రవిశంకర్,ఎండురి తిరుపాలు, ఉన్నం ధనుంజయ,ఎండురి మోహన్ రావు, చికెన్ భాష,మంజు అరుణ ఇళ్లలోచోరీకి పాల్పడ్డారు.వివరాల మేరకు బోయపాటి రవిశంకర్ తన కుమార్తె ఆరోగ్యం బాగలేక పోవడంతో చికిత్స నిమిత్తం బెంగుళూరుకు వెళ్లగా ఇంటి తాళాలు పగలుకొట్టి రెండు బిరువాల్లోఉన్న నల్ల పూసల దండ,2 చైన్లు, నక్లెస్,నాలుగు ఉంగరాలు,లక్ష్మి బిళ్ళ,3 జతల బంగారు కమ్మలు,చెంప చారలుతో కలిపి మొత్తం సుమారు12 తులలు పైగా బంగారం,10 తులాలు వెండి,20 వేలు నగదు చోరీ చేశారు. లారీ డ్రైవర్ ధనుంజయ డ్యూటికి వెళ్లగా ఇంటి తాళాలు పగలుకొట్టి బీరువాలోఉన్న రూ.72 వేల నగదు,ఎండూరి తిరుపాలు ఇంట్లో 3 సెల్ మొబైల్స్, చికెన్ భాష ఇంట్లో రూ.500 నగదు, ఎండురి మోహన్ రావు ఇంట్లో తాళలు పగలుకొట్టి చోరీకి పాల్పడగా ఇంట్లో ఏమి లేక పోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు.మంజుల అరుణ తన తల్లి సాలమ్మ ఇంటికి వెళ్లి నిద్రిస్తుండగా ఇంటి తాళాలు పగలుకొట్టి ట్రంకు పెట్టెలోఉన్న 3 తులాలు బంగారం,16 తులాల వెండి,లక్ష నగదు చోరీ చేశారు.గ్రామంలో గతంలో ఎప్పుడు లేని విధంగా 6 ఇళ్లలో ఒకేసారి చోరీ జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.అదే గ్రామంలో మరియొక ఇంట్లో చోరీకి ప్రయత్నిచారు సిసి కెమెరాలో గురువారం రాత్రి 2.50 నిమిషాల సమయంలో నలుగురు వ్యక్తులు చోరీకి ప్రయత్నించగా ఇంట్లో వ్యక్తులు నిద్రిస్తుండడంతో చేసేది ఏమిలేక వెనుతిరిగి పోయారు.విషయం తెలుసుకున్న ఎస్ ఐ రమేష్ బాబు, తమ సిబ్బందితో చోరీ జరిగిన ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించి బాధితులను విచారించి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అంబేద్కర్ భవన నిర్మాణం మరియు దళిత బహుజన జేఏసీ నేతలు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 12 శుక్రవారం అంబేద్కర్ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మిగనూరు శాసనసభ్యులు లిడాక్టర్ బి.వి జయనాగేశ్వర్ రెడ్డి కు వినతి: అంబేద్కర్ భవన నిర్మాణం మరియు దళిత బహుజన జేఏసీ నేతలుఅంబేద్కర్ భవన నిర్మాణం మరియు దళిత బహుజన సంఘ నాయకుల ఆధ్వర్యంలో లివంద మందితో కలిపి స్థానిక పెద్ద పార్క్ నుండి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ర్యాలీగా వెళ్లి శాసనసభ్యులు లిబీవీ జగనేశ్వర్ రెడ్డి గారికి అంబేద్కర్ భవన నిర్మాణం కొరకు తక్షణమే నిధులు కేటాయించాలని లిజేఏసీ గౌరవ అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ చైర్మన్ గడ్డం నాగేంద్ర లు రెప్రెజెంటేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ లి2018 సంవత్సరంలో ఏమ్మెల్లె బివి జయనాగేనశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ఎద్దుల మార్కెట్ సమీపంలో1.60 ఎకరాముల స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు, మీ ప్రభుత్వ హాయంలో మీరే భవన నిర్మాణం కోసం మూడు కోట్లు కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేసి ఎస్సీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని మాట్లాడారు. అందుకు లిశాసనసభ్యులు జయ నాగేశ్వర్ రెడ్డి గారు స్పందిస్తూ ఎస్సిల సామాజిక ఆర్థిక ఎదుగుదల కోసం తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తుందని అసెంబ్లీ సెషన్స్ అయిపోయిన వెంటనే మీ జేఏసీతో సంప్రదింపులు జరిపి ప్రాణాలిక బద్ధంగా ఒక ప్రక్రియ రూపంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణం మరియు దళిత బహుజన జేఏసీ నాయకులు ప్రసన్నకుమార్, కదిరికోట బతుకమ్మ ,నరసప్ప సుమల చార్లెస్, బిఎస్ఎస్ నాయకులు మల్లేష్ ,మునెప్ప వీరి ఆధ్వర్యంలో 100 మంది పాల్గొన్నారు.

# సిఎస్ఐ పాలెం లో 10 లీ,,నాటుసారా సీజ్

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు సెప్టెంబర్ 12 :**




కర్నూలు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు శు క్రవారం నందికొట్కూరు పట్టణంలోని సీఎస్ఐ పాలెం ఏరియాలో ఉండే బొల్లవరపు వేంకటరమణ నాటుసారా అమ్ముతున్నా పక్క సమాచారం మేరకు జరిపిన దాడులలో 10 లీ,,నాటుసారా సీజ్ చేసి, కేసు నమోదు చేయడం జరిగింది.ఈ దాడులలో సీ. ఐ రామాంజనేయులు, ఎస్.ఐ జఫరుల్లా, భాష్యం శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు కుమారి, కానిస్టేబుళ్లు సుధీర్ కుమార్, మధుప్రసాద్, శ్వేతా రాణి తదితరులు పాల్గొన్నారు..

# తిరుపతి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా మొట్టమొదటి "మహిళా సాధికారతపై పార్లమెంటు మరియు శాసనసభ కమిటీల జాతీయ సదస్సు" ను విజయవంతం చేద్దాం.లి

**"మహిళా సాధికారతపై పార్లమెంటు మరియు శాసనసభ కమిటీల జాతీయ సదస్సు" కు స్టేట్ నోడల్ అధికారులను కేటాయింపు**

**మహిళా సాధికారతపై పార్లమెంటు మరియు శాసనసభ కమిటీల జాతీయ సదస్సులికు సంబంధించి నోడల్ అధికారులు, లైజన్ అధికారులు వారికి కేటాయించిన విధులను పగడ్బందీగా నిర్వర్తించాలి**

**విధులు కేటాయించిన అధికారులు సంప్రదాయ దుస్తులతో విధులకు హాజరు కావలి.**
**జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, సెప్టెంబర్ 12 :**

ఈ నెల 14, 15 తేదీలలో జిల్లాలో జరగనున్న లి"మహిళా సాధికారతపై పార్లమెంటు మరియు శాసనసభ కమిటీల జాతీయ సదస్సు" ను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మొట్ట మొదటిసారి తిరుపతి జిల్లాలో "మహిళా సాధికారతపై పార్లమెంటు మరియు శాసనసభ కమిటీల జాతీయ సదస్సు" నిర్వహిస్తున్న నేపథ్యంలో దేశం గర్వించదగ్గ స్థాయిలో కలిసికట్టుగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్ శ్రీ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు తో కలిసి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు కాన్ఫరెన్స్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సమీక్ష సమావేశం నిర్వహించి నోడల్ అధికారులకు, లైజన్ అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14,15 వ తేదీలలో తిరుపతి రాహుల్ కన్వెన్షన్ సెంటర్ నందు లి"మహిళా సాధికారతపై పార్లమెంటు మరియు శాసనసభ కమిటీల జాతీయ సదస్సు" మన రాష్ట్రం, మన జిల్లా నందు మొట్ట మొదటి సారిగా నిర్వహిస్తున్నామని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి మహిళా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారని, రాహుల్ కన్వెన్షన్ హాల్ నందు సీటింగ్, స్టేజ్, ఏర్పాట్లు క్రమ పద్ధతిగా ఉండేలా లోక్ సభ సెక్రటరీ టీం ద్వారా పగడ్బందీగా నిర్వహించేలా ఆదేశించియున్నారని తెలిపారు. చందిగిరికోట వద్ద అతిథులకు ఆతిథ్యం ఇస్తామని, ఇప్పటికే కొంత మంది అతిథులు వచ్చారని రేపు ఉదయానికి అందరూ రాబోతున్నారని, నోడల్ అధికారులను నియమించడమే కాకుండా ప్రతి రాష్ట్రానికి సూపర్వైసింగ్ నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. అతిథులు వచ్చినప్పటి నుండి తిరిగివెళ్లేంతవరకు విధులు తూచాతప్పకుండా పాటించాలన్నారు. ఈ నెల 14 వ తేదీన రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రానున్నారని, సంబంధిత శాఖ అధికారులు సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సదస్సుకు గౌ. రాష్ట్ర గవర్నర్, లోక్ సభ స్పీకర్, అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాష్ట్ర మంత్రులు,జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు, సీనియర్ ఐ ఏ ఎస్ అధికారులు, వివిధ ప్రముఖులు రానున్నారని తెలిపారు. లైజన్ అధికారులు ఎయిర్పోర్ట్ నుండి అతిథులను స్వాగతించి వారు బస ఉండు చోటు వరకు జాగ్రత్తగా చేరుకునేలా అనుసరించాలన్నారు. పోలీసు శాఖ నుండి బందోబస్త్ ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. అతిథులకు తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి దర్శనాలకు ఏర్పాట్లను సంబంధిత అధికారులు చూసుకోవాలన్నారు. రాహుల్ కన్వెన్షన్ హాల్ వద్ద వైద్య అధికారులను ఏర్పాటు చేయాలని, హోటళ్ల వద్ద అంబులెన్స్ లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది తప్పని సరిగా సంప్రదాయ దుస్తులు ధరించి విధులు నిర్వహించాలన్నారు. తిరుపతి జిల్లా యంత్రాంగం సమన్వయంతో కృషి చేసి
ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, లైజన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో శ్రీవారి సేవకుల సేవలు అమోఘం

## కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, సెప్టెంబర్ 12.**



తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవలు అమోఘమని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ కొనియాడారు. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో శుక్రవారం ఆమె అన్న ప్రసాదం స్వీకరించారు. ముందుగా అన్న ప్రసాద కేంద్రం వద్దకు చేరుకున్న ఆమెకు టీటీడీ బోర్డు సభ్యులు శ్రీమతి సుచిత్ర ఎల్లా, శ్రీ భాను ప్రకాష్ రెడ్డి, అదనపు ఈవో శ్రీ సి. హెచ్. వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆమె భోజనశాల వద్దకు చేరుకుని శ్రీవారి సేవకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాలను వడ్డించారు. అన్న ప్రసాదం స్వీకరించిన అనంతరం ఆమె టీటీడీ ఫీడ్ బ్యాక్ పుస్తకంలో తన అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఇతర భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించడం హృదయానికి హత్తుకుందని పేర్కొన్నారు. అనంతరం ఆమె భక్తులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు శ్రీ రాజేంద్ర, శ్రీ భాస్కర్, వీజీవో శ్రీ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దళిత సమ్మేళన సభను జయప్రదం చేయండి kvps

## - కరపత్రంలను విడుదల చేసిన KVPS నాయకులు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 12 శుక్రవారం మండలం ఎమ్మిగనూరు పట్టణంలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ భవనమునకు రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేయాలని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాంక్ష విగ్రహం నెలకొల్పాలన్న డిమాండ్లతో ఈ నెల 13 న కు ర్ణి కళ్యాణ మండపం నందు తలపెట్టిన లి"దళితుల ఆత్మీయ సమ్మేళన సభ" కు దళిత, గిరిజనులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని లి%ఖవూా% మండల అధ్యక్ష కార్యదర్శులు లిచిన్నప్ప, ఎస్ తిమ్మన్న ,ఉపాధ్యక్షులు కలగొట్ల రాజా రమేష్ లు పిలుపునిచ్చారు. ఈరోజు సోగునూరు, గుడేకలు, కందనాతి, మాస్మం దొడ్డిగ్రామాలలో కరపత్రంలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత లిడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ లు రెండు కళ్ళు లాంటి వాళ్ళని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లినెంబర్:153/2012 ఆమోదం మేరకు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గారి కాంస్య విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. పార్టీలకతీతంగా జరిగే "దళితుల ఆత్మీయ సమ్మేళన సభ" కు మాల, మాదిగ,బేడ,బుడగ జంగాలు, ఎరుకల సామాజిక వర్గాలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లి%ఖవూా% సోగనూర్ , కందనాతి, మస్మన్ దొడ్డి, గుడేకల్ నాయకులు ,రాముడు, మనోహరు, మారెన్న, రాజేష్%శ్రీ% ,కుమార్, తిమ్మప్ప, శాంతిరాజు,ఏసేపు, ఇస్మాయిల్, రాజ్ కుమార్, దేవేంద్ర, గుడేకల్ నల్లన్న, లక్ష్మన్న చిన్న నరసింహులు, రోగెన్న, తదితరులు %ఖవూా% కార్యకర్తలు పాల్గొన్నారు

# అధిక వర్షానికి మట్టి మిద్దె నేలమట్టం

## - లక్ష రూపాయలు ఆస్థి నష్టం



**బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిధి** : బేతంచెర్ల మండలం ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో నివాసం ఉంటున్న దూదేకుల హుస్సేన్ మట్టి మిద్దె అధిక వర్షాల వల్ల శుక్రవారం నేల మట్టం అయింది. బాధితుని వివరాలమేరకు గురువారం రాత్రి కురిసిన అధిక వర్షానికి మట్టి మిద్దే పై కప్పు కూలి,నేల మట్టం అయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందులో విలువైన వస్తువులు వున్నాయి అని,దాదాపు ఒక లక్ష రూపాయల మేర ఆస్థినష్టం జరిగిందిని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు.



# పట్టణంలో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలి

**14 సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం**
**పురపాలక పరిపాలన శాఖ ఆర్డిఎంప నాగరాజు**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు సెప్టెంబర్ 12 :**

నందికొట్కూర్ పురపాలక సంఘమును ప్రాంతీయ సందాలకులు, పురపాలక పరిపాలన శాఖ ఆర్డిఎంప నాగరాజు శనివారం సందర్శించి పట్టణంలోని 14 సచివాలయ సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రాపర్టీ టాక్స్ ను గుర్తించి పన్నులు విధించుట అనధికార నీటి కనెక్షన్ లు, భవన నిర్మాణలు,ఖాళీ స్థలాలను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసు కోవలసినదిగా సూచించారు. పట్టణము నందు ప్లాస్టిక్ వాడకమును పూర్తి స్థాయి లో నివారించుటకు తగు చర్యలు తీసు కోవలసినదిగా కోరారు. 15 వ ఆర్థిక సంఘ నిధులతో పట్టణములో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయుటకు తగు చర్యలు చేపట్టాలని అని అన్నారు పట్టణంలో నీటి సమస్యలు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలసినదిగా, శానిటేషన్ పనులలో జాప్యం లేకుండా మరియు వర్ష కాలంలో విష జ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్ట వలసినదిగా, మరియు సచివాలయ సిబ్బంది విధులలో సమయ పాలన పాటించాలని, ఫిర్యాదుల ను సకాలంలో పరిష్కరించుట మొదలగు పనులను సూచనలు ఇచ్చారు.

# కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు.**



**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:** కర్నూలు జిల్లాలోని ఆలూరు నియోజకవర్గంలో మనేకృతి గ్రామంలో గురువారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కనకదాసు విగ్రహంపై ధ్వంసం చేశారని, ఇది సరైన పద్ధతి కాదని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని, ఈ విగ్రహ ధ్వంసం విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఆయన అన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకునే విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భక్త కనకదాసుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని,అలాంటి కుల దైవం అయినటువంటి కనకదాసు విగ్రహం ధ్వంసం చేయడం చాలా ఘోరమని ఆయన తెలియజేశారు. కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను, వెంటనే పోలీసులు గుర్తించి అలాంటి వారిని తక్షణమే చర్యలు తీసుకొని శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విగ్రహం ధ్వంసం చేసిన వాళ్ళనీ శిక్షించడమే కాక,వారిచే ఆ స్థానంలో నూతన విగ్రహాన్ని చేపట్టేలాగా తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిన కిరణ్,బత్తిన దేవేంద్ర, కురువ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బహుజన జేఏసీ నేతలు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 12 శుక్రవారం అంబేద్కర్ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మిగనూరు శాసనసభ్యులు లిడాక్టర్ బి.వి జయనాగేశ్వర్ రెడ్డి కు వినతి: అంబేద్కర్ భవన నిర్మాణం మరియు దళిత బహుజన జేఏసీ నేతలుఅంబేద్కర్ భవన నిర్మాణం మరియు దళిత బహుజన సంఘ నాయకుల ఆధ్వర్యంలో లివంద మందితో కలిపి స్థానిక పెద్ద పార్క్ నుండి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ర్యాలీగా వెళ్లి శాసనసభ్యులు లిబీవీ జగనేశ్వర్ రెడ్డి గారికి అంబేద్కర్ భవన నిర్మాణం కొరకు తక్షణమే నిధులు కేటాయించాలని లిజేఏసీ గౌరవ అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ చైర్మన్ గద్దం నాగేంద్ర లు రెప్రెజెంటేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ లి2018 సంవత్సరంలో ఏమ్మెల్లె బివి జయనాగేనశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ఎద్దుల మార్కెట్ సమీపంలో1.60 ఎకరాముల స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు, మీ ప్రభుత్వ హాయంలో మీరే భవన నిర్మాణం కోసం మూడు కోట్లు కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేసి ఎస్సీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని మాట్లాడారు. అందుకు లిశాసనసభ్యులు జయ నాగేశ్వర్ రెడ్డి గారు స్పందిస్తూ ఎస్సిల సామాజిక ఆర్థిక ఎదుగుదల కోసం తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తుందని అసెంబ్లీ సెషన్స్ అయిపోయిన వెంటనే మీ జేఏసీతో సంప్రదింపులు జరిపి ప్రాణాలిక బద్ధంగా ఒక ప్రక్రియ రూపంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణం మరియు దళిత బహుజన జేఏసీ నాయకులు ప్రసన్నకుమార్, కదిరికోట బతుకమ్మ ,నరసప్ప సుమల చార్లెస్, బిఎస్ఎస్ నాయకులు మల్లేష్ ,మునెప్ప వీరి ఆధ్వర్యంలో 100 మంది పాల్గొన్నారు.

# సజ్జ పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



తుగ్గలి మండల పరిధిలోని గల పలు గ్రామాలలో రైతులు కోసిన సజ్జ పంట కల్లాలను తుగ్గలి మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు శుక్రవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో పర్యటించి మండల వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడుతూ అధిక వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. రాబోవు రెండు రోజులు వర్షాలు ఉన్నందున ఎవరు సజ్జ పంటను కోయరాదని ఆయన రైతులకు తెలియజేశారు. ప్రస్తుతం సజ్జ పంటను కోసిన రైతులు వర్షానికి తడవకుండా జాగ్రత్త పడాలని ఆయన తెలియజేశారు. అల్పపీడన ప్రభావం తొలగిన తర్వాత వాతావరణ పరిస్థితుల ఆధారంగా సజ్జ పంటను రైతులు కోసుకోవాలని ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సజ్జ పంటకు గిట్టుబాటు ధర కల్పించిందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ బిల్డింగ్ నందు నాచురల్ ఫార్మింగ్ పై రైతు సేవ కేంద్రాల సిబ్బందికి శిక్షణా





**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు సెప్టెంబర్ 12 :**

నందికొట్కూరులో ఆత్మ బిల్డింగ్ నందు ఏపీ సీఎం ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్ ) ద్వారా రైతు సేవ కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా వ్యవసాయ సంచాలకులు ఎం సీ మద్దిలేటి హాజరయ్యారు. నందికొట్కూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. గిరిష్ సార్, నాలుగు మండలాల మండల వ్యవసాయ అధికారులు, ఏపీసీన్ఫ్
స్టాఫ్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల నేల నాణ్యత దెబ్బతింటోందని, భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ఆహారం
అందించాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా రైతులకు బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, తయారీ విధానాలు, ప్రధాన పంటలతో పాటు పలు పంటలు సాగు వంటి సాంకేతికతలను తెలియజేసి రైతులకు ఖర్చులు తగ్గించి ఆదాయాలు పెంచే మార్గాలను రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం మనందరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్, రైతు సేవా కేంద్రం యొక్క సిబ్బంది మరియు ఏపీసీన్ఫ్ సిబ్బంది కి పాల్గొనడం జరిగినది

# ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు సెప్టెంబర్ 12 :**



కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్థిక స్తోమత లేక అనారోగ్యతో బాధపడుతున్న బాధితులు ఆసుపత్రిలో నీసహాయ స్థితిలో ఉండగా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు ఆయన చెక్కులను నందికొట్కూరు నియోజకవర్గం నుండి సీఎం రిలీఫ్ ఫండ్ 8 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తుమ్మలూరు గ్రామలో మొల్ల హాజిరాబికి రూ 51,133 /-లు, మిటకందాల కిరణ్ బాబుకు రూ 59,105 /- మరియు (3) భూలక్ష్మి కి రూ 2,13,520/- . మరియు (4) సంజపోగు రాముడురూ 51,018/-లు
,మద్దూరు గ్రామం:- జస్వంత్ రెడ్డి కి రూ 21,962/-లు (6) బోయ అనుషకు రూ 1,0000/-లు,అల్లూరులో కొండూరు చిట్టమ్మకు 29,548 /- లుఇస్కాలలో లక్ష్మీదేవి కి 65,080 /-లు మొత్తం రూ 450,233 లక్షల చెక్కులను బాధితులకు అందజే సి బాధితులు తరపున సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మీడియా ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు సెప్టెంబర్ 12:**



నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల నలుమూల గ్రామాల నుంచి తరలివచ్చిన వివిధ వర్గాల ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను పరిశీలించి సంబంంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి పరిష్కరించారు.. మరి కొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని తెలియజేస్తున్నా అనినందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు.

# చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కళ్యాణ్

ఏపీ: అడవుల రక్షణ, అటవీ సంపద అక్రమ రవాణా వంటి కార్యకలాపాలను అరికట్టడంలో ఫారెస్ట్ శాఖ అధికారులు విశేష కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో వారు ప్రాణాలను సైతం కోల్పోతుంటారు. ఇలాంటి వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా సెప్టెంబరు 11 తేదీన జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ అమరుల కుటుంబాల సంక్షేమం కోసం ఏపీ ప్రభుత్వం తాజాగా రూ. 5 కోట్ల నిధులు విడుదల చేసినట్టు డిప్యూటీ సీఎం పవన్ తెలిపారు.



విధి నిర్వహణ, అడవులు, అటవీ సంపదలను కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ అధికారుల కుటుంబాల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు అటవీ అమరుల సంక్షేమ నిధికి రూ.5 కోట్లు జమచేసినట్టు ఏపీ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. సెప్టెంబరు 11న జాతీయ అటవీ అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఆయన ఈ మేరకు స్పందించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 5 కోట్లను సంక్షేమ నిధికి జమ చేశామని చెప్పారు. ఇందుకుగానూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'అడవులు, వన్యప్రాణులను రక్షించే క్రమంలో తమ ప్రాణాల ఫణంగా పెట్టినవారిని మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.. అటవీ అమరుల ధైర్య సాహసాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత.. వారి త్యాగం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం.. అటువంటి త్యాగమూర్తులకు జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను... గతంలో తాము ఇచ్చిన హామీ ప్రకారం అటవీ అమరుల కుటుంబాల సంక్షేమ నిధికి రూ. 5 కోట్లు కూటమి ప్రభుత్వం జమ చేసింది... ఈ విషయంలో సహకరించిన సీఎం నారా చంద్రబాబు నాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను... ఫారెస్ట్ అధికారుల భద్రత కోసం ఆధునిక ఆయుధాలు, రక్షణ సామాగ్రి, సమాచార సౌకర్యాలు, వాహనాలను అందజేయడంతో పాటు క్లిష్ట పరిస్థితుల్లో స్వీయరక్షణ, అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడం, సవాళ్లను అధిగమించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాం.. అడవులు మన జాతి సంపదని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత' అని ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

ఏటా సెప్టెంబరు 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తుంటారు. రాజస్థాన్‌లోని ఖేజర్లీ గ్రామంలో 1730 సెప్టెంబరు 11న చెట్లను రక్షించడానికి బిష్ణోయ్ సామాజిక వర్గం తమ ప్రాణాలను త్యాగం చేసింది. వీరి త్యాగాలను స్మరించుకుం టూ ఏటా సెప్టెంబరు 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం జరుకుంటున్నాయి. మార్వార్ రాజ్యాన్ని పాలించే జోధ్‌పూర్ మహారాజు అభయ్ సింగ్ రాజమహల్ నిర్మించడానికి కలప అవసరం కావడంతో ఖేజర్లీ గ్రామ సమీపంలోని అడవిలో చెట్లను నరికేయాలని ఆయన అదేశించారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన బిష్ణోయ్‌లు.. రాజు ఆదేశాలను ధిక్కరించారు. ఆ కమ్యూనిటీకి చెందిన అమృతా దేవి అనే మహిళ, ఆమె ముగ్గురు కుమార్తెలు చెట్లను నరకకుండా కావలించుకుని అడ్డుకున్నారు. వారి సాహసానికి గ్రామస్థులు మద్దతు తెలపడంతో రాజ సైనికులు రెచ్చిపోయి మారణకాండ సాగించారు. ఇందులో 350 మందికిపైగా గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. చెట్లను రక్షించుకోవాలనే వారి త్యాగాలకు గుర్తుగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం ఏటా సెప్టెంబరు 11న దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించారు.



## తురుకపాలెం మిస్టరీ మరణాలకు, ఆర్ఎంపీ క్లినిక్‌కు ఏంటి సంబంధం?

గుంటూరు: జిల్లా తురకపాలెంలో గత నాలుగు నెలలుగా అంతుబట్టని వ్యాధితో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో రాష్ట్ర, జాతీయస్థాయి వైద్య బృందాలు అక్కడ శిబిరాలను ఏర్పాటుచేసి, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. అక్కడి మట్టి నమూనాలు సేకరించారు. ఎయిమ్స్ బృందం వైద్యులు పర్యటించి రక్త నమూనాలు తీసుకుని, పరీక్షలకు పంపారు. ఈ క్రమంలో గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ గ్రామంలోని ఓ ఆర్ఎంపీ నడుపుతోన్న క్లినిక్‌ను అధికారులు సీజ్ చేశారు. ప్రస్తుతం జాతీయస్థాయిలో ఈ మరణాలపై చర్చ జరుగుతోంది. ఒకరి తర్వాత ఒకరు ఇలా రెండు నెలల్లోనే దాదాపు 30 మంది మృత్యువాతపడటంతో అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పటికే ఎయిమ్స్ వైద్య బృందాలు కూడా ఆ గ్రామంలో పర్యటించి, రక్తనమూనాలను సేకరించి పరీక్షించాయి. వాటి ఫలితాలు ఆధారంగా బాధితులకు చికిత్స అందజేస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా గ్రామంలో పర్యటించి, పరిస్థితిని పర్యవేక్షించారు. ఇక, గుంటూరు జనరల్ హాస్పిటల్‌లోనూ వీరికోసం ప్రత్యేక వార్డును ఏర్పాటుచేశారు. ఏపీ ప్రభుత్వం ఆరోగ్య అత్యవసర పరిస్థితిని కూడా ప్రకటించింది. గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. భయానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన తురకపాలెంలో గ్రామంలోని ఓ ఆర్ఎంపీ నడుపుతోన్న క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. మృతుల్లో కొందరు ఆర్ఎంపీ వద్దే తొలుత చికిత్స పొందినట్లు గుర్తించారు. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్‌ను బాధితులకు ఆర్ఎంపీ ఇచ్చినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాదు, ఎక్కువగా సెలైన్ల వాడకం కూడా ఇన్‌ఫెక్షన్‌కు కారణమని భావిస్తున్న అధికారులు.. ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసినట్టు వెల్లడించారు. అయితే, ఈ స్థానికులు మాత్రం ఆ ఆర్ఎంపీ వైద్యంపై విశ్వాసం వ్యక్తం చేయడం గమనార్హం. గత పదేళ్లుగా అతడు తమకు వైద్యం చేస్తున్నాడని, ఎప్పుడూ ఏం కాలేదని చెబుతున్నారు. తమ పిల్లలకు జ్వరం వచ్చినా ఆయన దగ్గరకే వెళ్తామని, చుట్టుపక్కల పది గ్రామాల్లో అతడు వైద్యం చేస్తున్నాడని అంటున్నారు.

దాదాపు మూడు వేల జనాభా ఉన్న పల్నాడు జిల్లా తురకపాలెం గ్రామంలో గత ఐదు నెలల్లోనే 28 మంది చనిపోయినట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవల వెల్లడించారు. జులై, ఆగస్టులోనే 20 మంది వరకు మరణించారు. పలువురు అతి ప్రమాదకరమైన 'మెలియాయిడోసిస్' అనే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆరుగురిలో ఒకరికి 'మెలియాయిడోసిస్' పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కానీ, మెలిన్ అనే బ్యాక్టీరియా వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుండగా.. గ్రామస్థులకు స్వయంగా ప్రభుత్వమే ఆహారం, తాగునీరు అందజేస్తోంది. అటు, పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధులు, పరిసరాలతో పాటు 68 నీటి ట్యాంకులను శుభ్రపరిచారు. తురకపాలెంలో పరిస్థితి అదుపులోకి వచ్చిందని జీజీహెచ్ వైద్యులు తెలిపారు. మెలియాయిడోసిస్ లక్షణాలతో ఆసుపత్రి చేరిన ఇద్దరు కోలుకోవటంతో వారిని డిశ్చార్జ్ చేశామని చెప్పారు. మరికొందరు అనుమానితుల నివేదికలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అటు, ఎన్‌సీడీసీ ఆధ్వర్యంలోని వైద్య నిపుణుల బృందం కూడా గ్రామంలో పర్యటించి, గ్రామస్థులు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసింది.

## టీటీడీ పాలకమండలిలోకి కొత్తగా మరో సభ్యుడు..

టీటీడీ పాలకమండలిలో మరో సభ్యుడిగా నియమితుల య్యారు. జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు స్థానంలో సుదర్శన్ వేణుని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎల్ దత్తును గతంలోనే టీటీడీ బోర్డ్ మెంబర్‌గా నియమించినా ఆయన పదవికి దూరంగా ఉన్నారు. ఆయన స్థానంలో వేణుకు అవకాశం ఇచ్చారు. వేణు గతంలో కూడా టీటీడీ సభ్యుడిగా పనిచేశారు. ఇప్పుడు మరోసారి ఆయనకు సభ్యుడిగా అవకాశం దక్కింది.

టీటీడీ పాలకమండలిలో మరో కొత్త సభ్యుడు చేరారు.. సుదర్శన్ వేణును టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి టీటీడీ బోర్డులో జస్టిస్ హెచ్‌ఎల్ దత్తును నియమించారు. ఆయన ఇప్పటి వరకు టీటీడీ పాలకమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయలేదు, బాధ్యతలు తీసుకోలేదు. ఈ కారణంగా ఆయన స్థానంలో సుదర్శన్ వేణును టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమించారు. అయితే సభ్యునికి (హెచ్‌ఎల్ దత్తు) మిగిలి ఉన్న పదవీకాలానికే సుదర్శన్ వేణు ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కర్ణాటకకు చెందిన జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు పలు రాష్ట్రాల్లో హైకోర్టుల న్యాయమూర్తి, ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు.. 2014లో సీజేఐగా నియమితులయ్యారు. డిసెంబర్ 2, 2015న పదవీ విరమణ చేశారు. సీజేఐగా పనిచేసిన జస్టిస్ దత్తును టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమించింది ఏపీ ప్రభుత్వం. కానీ ఆయన మాత్రం ఆ పదవిని స్వీకరించలేదు.. అప్పటి నుంచి ఆ పదవి ఖాళీగా ఉంది.. తాజాగా సుదర్శన్ వేణు ను నియమించారు. సుదర్శన్ వేణుది కూడా కర్ణాటక కాగా.. ఆయన ప్రముఖ పారిశ్రామికవేత్త. సుదర్శన్ వేణు గతంలో కూడా టీటీడీ పాలకమండలిలో సభ్యులుగా ఉన్నారు.



### శ్రీనివాస కళ్యాణాల పేరుతో మోసం

విదేశాల్లో నకిలీ శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది. యూకేలోని శ్రీ అద్వైత సేవా సమితి అనే సంస్థ 2025 సెప్టెంబర్ 6న యునైటెడ్ కింగ్డమ్లోని వద్ద శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వాట్సాప్ గ్రూపుల్లో ఆహ్వాన పత్రికను వైరల్ చేశారు. ఇలాంటి అనధికారిక కల్యాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. శ్రీనివాస కళ్యాణ మహోత్సవం పేరుతో జరుగుతున్న మోసం బయటపడగా.. నుంచి అనుమతి లేదు. కూడా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. కానీ ఆహ్వాన పత్రికలో లోగో వాడారు. దీనిపై ఫిర్యాదు రావడంతో విజిలెన్స్ శాఖకుఆదేశాలు జారీ చేసింది. ఆహ్వాన పత్రికలో ఉచితం అని రాశారు. కానీ ప్రత్యేక సేవల గురించి వివరాలు ఇవ్వలేదు. సేవా ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేసే అవకాశం ఉంది.

ఆహ్వాన పత్రికపై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే అసలు విషయం బయటపడింది. భక్తుల రిజిస్ట్రేషన్ వివరాలతో పాటు సేవా ఫీజు ( 566 పౌండ్లు) వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అంటే దాదాపు రూ.58,000 వసూలు చేస్తున్నారు. డబ్బులు వసూలు చేయడంతో పాటు కొన్ని వస్తువులు ఇస్తామని చెబుతున్నారు. కళ్యాణ లడ్డూ ప్రసాదం, వెండి లాకెట్, నవరత్న వేద వస్త్రం, అక్షింతలు, పసుపు, అమ్మవారి కుంకుమ, చీర, మంగళ్యం ధారం, జాకెట్టు, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఫోటో ఫ్రేమ్ ఇస్తామని అంటున్నారు.

ఇది భక్తులను మోసం చేయడమేనని హెచ్చరిస్తు న్నారు. ఇలా శ్రీనివాస కళ్యాణాల పేరుతో భక్తులను గందరగోళానికి గురిచేసే అనధికార కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని భక్తులకు టీటీడీ సూచించింది. టీటీడీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా ఇలా నకిలీ కల్యాణోత్స వాల పేరుతో ప్రచారం చేస్తూ డబ్బులు కోరితే టిటిడి విజిలెన్స్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## తొలిసారి రైలొచ్చింది.. ఎన్నో ఏళ్ల కల నెరవేరింది

ప్రకాశం: జిల్లాలోనడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా కనిగిరి సమీపంలోని యడవల్లికి గూడ్స్ రైలు చేరుకుంది. బిలాస్‌పూర్ నుండి వచ్చిన ఈ రైలు మార్గం నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తీసుకువచ్చింది. డిసెంబర్ మొదటి వారంలో కనిగిరి వరకు రైళ్లు వస్తాయని అధికారులు తెలిపారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారు. అక్కడ కొత్త రైల్వే స్టేషన్ సిద్ధమైంది, తొలిసారి రైలు పరుగులు తీసింది. మొదటిసారిగా వచ్చిన రైలుకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.. మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో రైళ్లు తిరుగతాయనే ఆనందంలో ఉన్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో ప్రజలకు నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ రైలు మార్గం ఎన్నో ఏళ్ల కలగా మిగిలింది.. అయితే ఎట్టకేలకు ఆ మార్గంలో పనులు వేగవంతం కావడంతో రైలు కూతలు వినిపిస్తున్నాయి. కనిగిరి వరకు రైలు పట్టాలు, స్టేషన్ల నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయి.



ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్ నుంచి ఓ గూడ్స్ రైలు కనిగిరి సమీపంలోని యడవల్లికి చేరుకుంది. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల కోసం ఈ రైలు వచ్చింది. దీంతో స్థానిక ప్రజలు ఆనందంలో ఉన్నారు.. ఆ రైలుకు స్వాగతం పలికారు. ఈ రైలు బిలాస్‌పూర్ నుంచి 30 పెట్టెలతో వచ్చింది. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు కావలసిన ట్రాక్‌లు, ఇతర సామాగ్రిని ఈ రైలులో తీసుకొచ్చారు. ఈ రైలు మార్గంలో భూసేకరణ సమస్యలు తీరడం, క్వారీ సమస్య పరిష్కారం కావడంతో రైలు మార్గం త్వరలో అందుబాటులోకి రానుంది. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో స్థల సేకరణకు సంబంధించిన పరిహారం రూ.7 కోట్లు చెల్లించడంతో సమస్యలు పరిష్కారం అయయ్యాయి. రైల్వే లైన్ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో కనిగిరికి రైళ్లు వస్తాయని తహసీల్దార్ రవిశంకర్ అంటున్నారు. దీంతో కనిగిరి ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది.

కనిగిరి దగ్గరలోని శంకవరం దగ్గర ఈ రైలు మార్గంపై క్వారీ నిర్వాహకులు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో వంతెన నిర్మాణం ఆగిపోయింది. దీంతో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి క్వారీల నిర్వాహకులతో చర్చలు జరిపారు, వారితో సమస్యలపై మాట్లాడారు. సమస్యను పరిష్కరించడంతో వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. యడవల్లి, పోలవరం రైలు నిలయాలతో పాటు వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి కనిగిరికి రైళ్లు వస్తాయని రైల్వేశాఖ అధికారులు కూడా చెబుతున్నారు.

ప్రకాశం జిల్లాలోని దర్శి, పొదిలి వరకు రైల్వే మార్గం పనులు దాదాపుగా పూర్తయ్యాయి.. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మిగిలిన పనుల్ని కూడా ఈ ఒకటి, రెండు నెలల్లో పూర్తి చేస్తామంటున్నారు అధికారులు. కనిగిరి వైపు పనులు జరుగుతున్నాయి.. యడవల్లి రైల్వే స్టేషన్‌కు సంబంధించిన పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ రైలు మార్గంలో నడికుడి నుంచి కనిగిరి వరకు దాదాపు 145 కిలో మీటర్ల మేర రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. యడవల్లి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్, అధికారుల గెస్ట్ హౌస్‌లు, సిగ్నల్ కార్యాలయం, ప్రయాణికులు కూర్చోడానికి బల్లలు, తాగునీటితో వంటి వసతుల పనులు జరుగుతున్నాయి. అటు పామూరు మండలం రావిగుంటపల్లి వరకు ట్రాక్ సిద్ధమైందని చెబుతున్నారు.

## యూరియా బదులు దీన్ని దర్జాగా వాడుకోవచ్చు..

ఏపీ: యూరియా కొరత వేడి రాజుకుంటున్న వేళ, ప్రభుత్వం రైతులకు నానో యూరియాను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా యూరియా బస్తాల మోత ఇక ఉండదు. కేవలం అర లీటరు నానో యూరియాతోనే ఎకరానికి సరిపోతుంది. దీని వాడకంపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. గతేడాది కంటే ఈ ఏడాది నానో యూరియా వాడకం పెరిగింది. ప్రభుత్వం యూరియా కొరత లేదంటే.. ప్రతిపక్షాలు మాత్రం రైతులకు సకాలంలో యూరియా అందడం లేదని చెబుతున్నాయి. అయితే రైతులు ఇకపై యూరియా కోసం ఎదురు చూడకుండా, షాపుల దగ్గర గంటల తరబడి నిలబడకుండా సరికొత్త ఆలోచన చేసింది ప్రభుత్వం. రైతులకు యూరియా కష్టాల నుంచి బయటపడేసేందుకు నానో యూరియా అందుబాటులోకి వచ్చింది. యూరియా బస్తాలను మోసుకెళ్లే పనిలేకుండా.. జస్ట్ అర లీటరు నానో యూరియా వాడితే సరిపోతుంది అంటున్నారు. కేవలం రూ.225కు కొనుగోలు చేయొద్దు.. ఇది పంటలకు పోషకాలను అందిస్తుంది. వరి, పత్తి వంటి పంటలపై నానో యూరియా పిచికారి చేయొచ్చంటున్నారు. రాష్ట్రంలో రైతులకు అవగాహన కల్పిస్తుండటంతో నానో యూరియా వాడకం బాగా పెరిగింది. నానో యూరియా వాడకం రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. ఇది పైరుకు పోషకాలను అందిస్తుంది.. రైతులు దీనిని ఉపయోగించి మంచి దిగుబడి పొందవచ్చు.



తెలుగు రాష్ట్రాల్లో రైతులు యూరియా వాడకం విషయంలో ఇంకా పాత పద్ధతినే ఫాలో అవుతున్నారు.. నానో యూరియాతో ఉపయోగం ఉన్నా సరే ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. వ్యవసాయానికి సంబంధించి శాస్త్రవేత్తలు యూరియాకు బదులుగా నానో యూరియా వాడమని సూచిస్తున్నారు. సాధారణ యూరియా బస్తాలో ఉండే పోషకాలు, అర లీటరు నానో యూరియాలో ఉంటాయంటున్నారు. యూరియా గుళికల రూపంలో ఉంటే.. నానో యూరియా ద్రవ రూపంలో ఉంటుంది. సాధారణంగా రైతులు ఉపయోగించే యూరియాలో కణాల పరిమాణం 2.8–4 మిల్లీ మైక్రాన్లు ఉంటే.. అందులో మొక్కకు 30 శాతం వరకు మాత్రమే చేరుతుంది. మిగిలిన యూరియా వృథానే (నీటిలో, భూమిలో కలిసి కాలుష్యం చేస్తుంది) అంటున్నారు.

అదే నానో యూరియా కణాల పరిమాణం 32 నానో మైక్రాన్లు ఉంటుంది.. ఏకంగా 80 శాతం పైగా మొక్కకు చేరుతుంది అంటున్నారు.. నానో యూరియా వల్ల వృథా ఉండదు, కాలుష్యం కూడా తగ్గుతుందంటున్నారు. రైతులు ఉపయోగిస్తున్న సాధారణ యూరియా వేర్ల ద్వారా మొక్కకు అందడానికి ఆలస్యం అవుతుంది. నానో యూరియా జస్ట్ అలా మొక్కల ఆకులపై పిచికారి చేయగానే నేరుగా పత్రహరితానికి చేరి వెంటనే ప్రభావం చూపిస్తుంది అంటున్నారు శాస్త్రవేత్తలు. ఒక్క ఎకరాకి జస్ట్ అర లీటర్ నానో యూరియా చాలు.. దీన్ని లీటర్‌కు 4 ఎంఎల్ చొప్పున 120 లీటర్ల నీటిలో కలపాలని సూచిస్తున్నారు. దీనిని డ్రోన్ ద్వారా అయితే కనుక ఎకరానికి 350–400 ఎంఎల్ సరిపోతుంది.


యూరియా బస్తా (45 నుంచి 50 కిలోలు) ధర రూ.266 ఉండగా.. వ్యాపారులు రూ.100 అదనంగా వసూల చేస్తే మొత్తం రూ.366 పడుతుంది. రవాణా ఖర్చు నుంచి పొలంలో చల్లేందుకు కలిపి బస్తాకు మొత్తం ఖర్చు రూ.700 వరకు అవుతుంది. దీని బదులుగా నానో యూరియా అర లీటర్ రూ.225కే వస్తుంది.. బస్తాలు మోయాల్సిన పని కూడా లేదు. తక్కువ ఖర్చులోనే నాన యూరియాను ఉపయోగించొచ్చు. రైతులు ఉపయోగించే యూరియా గుళికల వల్ల మొక్కలు పచ్చగా అవుతాయి.. నానో యూరియా ఉపయోగిస్తే మొక్కలు పచ్చగా రావు. ఈ అపోహ వల్లే చాలామంది రైతులు నానో యూరియా ఉపయోగించడం లేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. నానో యూరియాను పూత, గింజ దశలో పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయంటున్నారు. నానో యూరియా, నానో జింక్ కూడా పిచికారీ చేసుకోవచ్చు అంటున్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ ద్వారా నానో యూరియా వాడకంపై రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నానో యూరియా వాడకం పెరిగిందంటున్నారు.

## ఇకపై రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతాయి..

ఏపీ: రైలు ప్రయాణికులకు ముఖ్యమైన గమనిక.. ఆ రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇకపై మరో స్టేషన్‌లో ఆగనున్నాయి. ఈ మేరకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కీలక ప్రకటన చేశారు. త్వరలో అత్తిలి రైల్వే స్టేషన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతాయని చెప్పారు. కరోనా తరువాత ఆగిన రైళ్లను తిరిగి ఆపేందుకు (హాల్ట్) రైల్వే అధికారులతో మాట్లాడగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. అత్తిలిలో పూరీ–తిరుపతి, కాకినాడ–చెన్నై సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లు చెప్పారు. స్థానికులు రైళ్లు ఆగడం లేదని చెప్పడంతో వెంటనే స్పందించి రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేయగా అంగీకారం తెలిపారన్నారు. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో దీనికి సంబంధించిన ఉత్తర్వులు వస్తాయన్నారు. 'అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని స్థానికులు కోరిన అభ్యర్థనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, రెండు ఎక్స్ప్రెస్ రైళ్లు అత్తిలిలో ఆగేలా అనుమతులు సాధించటం ఆనందంగా ఉంది. గత ఎన్నికల ప్రచారంలో అత్తిలి ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చాను , త్వరలోనే మరికొన్ని ఎక్స్ప్రెస్ రైళ్లు కూడా ఇక్కడ నిలిచేలా చర్యలు తీసుకుంటాను. పూరి – తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు (17479/17481) ఉదయం 9.53.. తిరుపతి – పూరి ఎక్స్‌ప్రెస్ రైలు (17480/17482) రాత్రి 20.33.. చెంగల్‌పట్టు – కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైలు (17643) ఉదయం 4.33.. కాకినాడ – చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్ రైలు (17644) సాయంత్రం 16.33 గంటలకు అత్తిలి స్టేషన్‌లో ఆగుతాయి' అని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ట్వీట్ చేశారు. మరోవైపు చెన్నై–విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ రైలు నరసాపురం వరకు పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. త్వరలో అధికారిక ప్రకటన వస్తుందని.. కొన్ని సాంకేతిక సమస్యల కారణం గా ఇప్పటి వరకు ఆలస్యమైందని చెప్పారు. ప్రస్తుతం నడుస్తున్న నరసాపురం–అరుణాచలం వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు మరో నెల పొడిగిం చినట్లు తెలిపారు. తాను ఈ రైలును రెగ్యులర్‌గా మార్చాలని కోరానని.. సానుకూల స్పందన వచ్చిందని చెప్పుకొచ్చారు.

## గోదావరిపై కొత్తగా 2 వరుసల బ్రిడ్జి..

కోనసీమ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి లంకవాసుల కష్టాలు తీర్చే పనిలో ఉంది. వర్షాకాలం, గోదావరికి వరదలు వచ్చిన సమయంలో ఇబ్బందుల్ని గమనించి బ్రిడ్జిల నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో లంక గ్రామాలు చాలానే ఉన్నాయి.. ఎన్నో ఏళ్లుగా వరదల సమయంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కమాటల చెప్పాలంటే బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అందుకే ఏపీ ప్రభుత్వం గోదావరిపై బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేసింది. గతంలో ఆగిపోయిన పనులు మళ్లీ పట్టాలెక్కాయి. ఈ రెండు బ్రిడ్జిలను పి.గన్నవరం మండలం జి.పెదపూడి లంక దగ్గర వశిష్ట గోదావరిపై నిర్మిస్తున్నారు. ఈ ఈ వంతెన నిర్మాణం కోసం రూ.71.43 కోట్లు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలోని పి గన్నవరం సమీపంలో బూరుగులంక, అరిగెలవారి పేట, ఉడుముడి సహా గ్రామాలు ఉన్నాయి. గోదావరికి వరదలు వస్తే ఈ గ్రామాల్లో ప్రజలకు కష్టాలు మొదలవుతాయి. గత నెలలో భారీ వర్షాలు కురవడంతో పి.గన్నవరం, ఆలమూరు, అయినవిల్లి మండలాల్లోని లంక గ్రామాల ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఇటీవల వర్షాలకు మూలస్థానం, తోకలంక మధ్య నిర్మించిన కాజ్‌వే వరద దెబ్బకు కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు పడవల్లో రాకపోకలు సాగించారు. అందుకే 2018లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మించేందుకు అనుమతించింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ఆలస్యం అయ్యాయి.. 2023లో కాంట్రాక్టర్, టెండరు ఖరారై పనులు మొదలు పెట్టినా బకాయిలు పెండింగ్ పెట్టడంతో పనిలో నిలిచిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులపై ఫోకస్ పెట్టారు. మొత్తం ఈ బ్రిడ్జి నిర్మాణంలో దాదాపు రూ. 30 కోట్ల పనులు చేపట్టగా.. 40 శాతం వరకు పనులు పూర్తి చేశారు. వారం క్రితం పెండింగ్ ఉన్న డబ్బుల్ని కాంట్రాక్ట్ సంస్థకు చెల్లించారు. ఈ మేరకు మొదటి బిల్లుగా రూ. 21 కోట్లు చెల్లించింది. ఈ క్రమంలో పనులు మళ్లీ వేగవంతం కాగా.. 2027 మార్చి నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా పనుల్లో స్పీడ్ పెంచారు. ఈ బ్రిడ్జికి సంబంధించి మొత్తం 11 పునాదులు ఉంటే.. 7 పునాదుల పనులు పూర్తి చేశారు. కాంట్రాక్టర వీటిపై సూపర్ స్ట్రక్చర్ పనులు మొదలు పెట్టబోతున్నారు.



# కీలక బిల్లులకు గవర్నర్ ఆమోదం..

తెలంగాణ: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రెండు కీలక బిల్లులకు ఆమోదం తెలిపారు. వీటిలో ఒకటి జిన్నారం మున్సిపాలిటీలో గ్రామాలు చేర్చడానికి ఉద్దేశించిన బిల్లు.. మున్సిపల్ చట్ట సవరణకు ఆమోదం. ప్రభుత్వం పంపిన నాలుగు బిల్లుల్లో ఈ రెండింటికి మాత్రమే ఆమోదం లభించింది. అయితే.. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేస్తూ అసెంబ్లీ ఆమోదించిన చట్టాలు మాత్రం ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీ, శాసన మండలిలో ఆమోదం పొందిన నాలుగు ముఖ్య బిల్లులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపగా.. అందులో రెండు బిల్లులకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిన్నారం మున్సిపాలిటీలో కొత్త గ్రామాల విలీనానికి సంబంధించి, అలాగే మున్సిపల్ చట్టంలో కొన్ని సవరణలకు గవర్నర్ ఆమోదం లభించింది. ఈ రెండు బిల్లులకు సంబంధించి త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది.

**ఆమోదం పొందని రిజర్వేషన్ల బిల్లులు**

అయితే.. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేతకు సంబంధించిన బిల్లులు మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వీటి ద్వారా బీసీ వర్గాలకు 42 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో సవరణలు చేసింది. అసెంబ్లీ ఆగస్టు 31న, శాసన మండలి సెప్టెంబర్ 1న ఈ బిల్లులకు ఆమోదం తెలిపినప్పటికీ, గవర్నర్ నిర్ణయం ఇంకా వెలువడకపోవడంతో రాజకీయ వర్గాల్లో చర్చలు రేగుతున్నాయి.

**ఎన్నికలపై ప్రభావం..**

గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, పురపాలక సంస్థలు, నగర పాలక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ బిల్లులపై గవర్నర్ నిర్ణయం అత్యంత కీలకం కానుంది. రిజర్వేషన్ల పెంపు అమల్లోకి వస్తే బీసీ వర్గాలకు మరిన్ని స్థానాలు లభిస్తాయి. ఇది స్థానిక స్థాయి నాయకత్వంలో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. మరోవైపు.. ఈ నిర్ణయం ఆలస్యమైతే ఎన్నికల షెడ్యూల్‌పై కూడా ప్రభావం పడే అవకాశముంది.

**వివిధ వర్గాల స్పందన..**

ప్రభుత్వ వర్గాలు గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. బీసీ సంఘాలు మాత్రం వెంటనే ఆమోదం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంలో రాజకీయ లెక్కలు ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రిజర్వేషన్ల పెంపు వలన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీసీ వర్గాల రాజకీయ ప్రభావం పెరిగి, భవిష్యత్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. బీసీలకు స్థానిక సంస్థల్లో అధిక ప్రాతినిధ్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లపై అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ స్థాయిలో జీవో నంబర్ 67, మున్సిపల్ స్థాయిలో జీవో నంబర్ 68ను విడుదల చేస్తూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు ప్రకటించింది.

# ఆమె కోసం అన్నీ చేసింది.. చివరికి..!

జనగామ: జిల్లాలో ఆస్తి కోసం కన్నతల్లిని కూతురు, అల్లుడు కలిసి దారుణంగా హత్య చేశారు. లక్ష్మి అనే మహిళ తనకున్న భూమిని కూతురికి ఇవ్వడానికి నిరాకరించడంతో.. ఆమెను నిద్రలో ఊపిరాడకుండా చంపేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది, ఆస్తి వ్యామోహంతో సొంత తల్లిని చంపడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ బంధాల విలువలు క్షీణించి, ఆస్తిపాస్తుల కోసం సొంతవారిని చంపుకోవడానికి కూడా వెనుకాడడం లేదు నేటి సమాజం. కుమారులే కాదు కుమార్తెలు కూడా దారుణాలకు పాల్పడుతున్నారు. కనిపెంచిన కన్నవారిని ఆస్తుల కోసం పొట్టన పెట్టుకుంటున్నారు. తాజాగా జనగామ జిల్లాల్లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆస్తి, డబ్బు కోసం సొంత కూతురు కన్న తల్లిని దారుణంగా హత్యల చేసింది. ఈ ఘటన సమాజంలో పెరిగిపోతున్న కరత్వాన్ని సూచిస్తోంది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం.. కొండాపురం పెద్దతండాకు చెందిన బాదావత్ లక్ష్మి (45) భర్తను కోల్పోయి 20 ఏళ్లు అయింది. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ తన ఒక్కగానొక్క కూతురు సంగీతను ఎంతో కష్టపడి పెంచి పెద్ద చేసింది. ఐదేళ్ల క్రితం సంగీత ప్రేమ వివాహం చేసుకుంటానని చెప్పగా.. తల్లి లక్ష్మి తనకున్న మూడెకరాల పది గుంటల భూమిలో రెండు ఎకరాలు అమ్మి పెళ్లి చేసింది. అల్లుడు వీరన్నకు కట్న కానుకలు ఇచ్చి, ఆడపడుచులకు 20 గుంటలు రాసిచ్చింది. మిగిలిన 30 గుంటల భూమిని మాత్రం తన అవసరాల కోసం ఉంచుకుంది. అయితే, కూతురు సంగీత, అల్లుడు వీరన్న ఆ 30 గుంటల భూమిని కూడా తమ పేరు మీద రాయాలని లక్ష్మిని వేధించడం మొదలుపెట్టారు. పలుమార్లు ఈ విషయంపై గొడవపడ్డారు. చివరికి, లక్ష్మి తాను బ్రతికి ఉన్నంతకాలం భూమి ఇచ్చేది లేదని తన తర్వాత వారికే చెందుతుందని తేల్చి చెప్పింది. దీంతో కక్ష పెంచుకున్న కూతురు, అల్లుడు అత్యంత దారుణానికి ఒడిగట్టారు. సెప్టెంబర్ 9వ తేదీ రాత్రి నిద్రలో ఉన్న లక్ష్మి ముఖంపై దిండు అదిమి ఊపిరాడకుండా చేసి చంపేశారు. ఉదయం లక్ష్మిని కూలీ పనికి పిలవడానికి వచ్చిన చుట్టుపక్కల మహిళలు ఆమె మెడపై గాయాలు చూసి అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు.

# కుల ధ్రువీకరణ పత్రం మరింత ఈజీగా..

తెలంగాణ: కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. మీసేవ కేంద్రాల్లో నిమిషాల్లోనే పత్రాలు పొందే అవకాశం కల్పించింది. గత 15 రోజుల్లోనే 17,500 మందికి పైగా లబ్ధి పొందారు. పాత సర్టిఫికేట్ నంబర్ ఆధారంగా లేదా ఇతర వివరాలతో సులభంగా పొందవచ్చు.

తెలంగాణలో కుల ధ్రువీకరణ పత్రాల జారీని వేగవంతం, సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఈ కొత్త విధానం ప్రకారం.. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న నిమిషంలోపే పత్రాలు జారీ అవుతున్నాయి. ఈ కొత్త విధానం గత 15 రోజులుగా అమలులో ఉంది. ఈ స్వల్ప కాలంలోనే 17,500 మందికి పైగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందారు. కొత్త విధానం వల్ల ఏటా సుమారు 20 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

కొత్తగా కుల ధ్రువీకరణ పత్రం తీసుకునే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ప్రతిసారి ఆమోద ప్రక్రియకు వెళ్లాల్సిన అవసరం లేదు. పాత సర్టిఫికేట్ నంబర్ తెలిసినవారు దాని ఆధారంగా వెంటనే కొత్త సర్టిఫికేట్ పొందవచ్చు. పాత సర్టిఫికేట్ నంబర్ తెలియకపోతే జిల్లా, మండలం, గ్రామం, ఉపజాతి, పేరు వంటి వివరాలతో శోధించి ధ్రువీకరణ పత్రం పొందవచ్చు. పేరు, ఇంటిపేరు, తండ్రి పేరు వంటి సవరణలు అవసరమైతే మాత్రం జిల్లా అధికారికి ఫిర్యాదు చేసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2020 సెప్టెంబర్ 9 నాటి జీవో నెంబర్ 3 ప్రకారం, హిందూ ఎస్సీ వర్గం నుండి క్రైస్తవ మతంలోకి మారి బీసీ–సీ వర్గానికి చెందిన వారికి పూర్వపు ఆమోద విధానమే వర్తిస్తుంది. ఇక జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా సంస్కరణ కేంద్రాలుగా





మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా ఖైదీలకు డిజిటల్ విద్య, నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఖైదీల ఆరోగ్యం, మానసిక స్థితిని పర్యవేక్షించడానికి సాంకేతికతను ఉపయోగించుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆయన అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన ఈ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని మంత్రి అభినందించారు.

తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మానసిక సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం పరిష్కారం చూపగలదని ఆయన అభిప్రాయపడ్డారు. 'సైబర్ హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్' రూపొందించిన ఆధారిత మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం 'హోప్ ఐ'ని మంత్రి ఇటీవల ఆవిష్కరించారు. ప్రజల ప్రాణా లను కాపాడే ఆవిష్కరణలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుం దని, సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు అందించేలా యువ ఆవిష్కర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు.

# మ్యాన్‌హోల్‌లో పడిన బాలిక..

హైదరాబాద్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ బాలిక అకస్మాత్తుగా మ్యాన్‌హోల్‌లో పడిపోయింది. బాలిక వెనకాలే వస్తున్న తల్లి వెంటనే అప్రమత్తమై.. బిడ్డను బయటకు తీసింది. హైదరాబాద్‌లోని యాకుత్‌పురాలో ఈ ఘటన చోటు చేసుకుంది. యాకుత్‌పురాకు చెందిన మహిళ తన ఇద్దరు చిన్నారులను తీసుకొని పాఠశాలకు పంపించేందుకు వెళ్తున్నారు. ఆరేళ్ల బాలిక కాస్త ముందు నడుస్తోంది. రోడ్డు మధ్యలో తెరచుకొని ఉన్న మ్యాన్‌హోల్‌లో పడిపోయింది. తల్లి వెంటనే ఆమెను బయటకి లాగారు. అక్కడికి పరుగెత్తు కొచ్చిన స్థానికుడొకరు బాలిక స్కూల్ బ్యాగ్‌ను బయటకి తీశారు. మ్యాన్‌హోల్ మూత తెరిచి ఉంచడంతో ఈ ప్రమాదం



జరిగింది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడే అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాలిక తల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుమార్తెకు మురికి అంటుకోవడంతో శుభ్రం చేసేందుకు తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. భారీ వర్షం కురిసినప్పుడు వరద ఫోర్స్‌కు మ్యాన్‌హోల్ మూతలు తెరుచుకుంటున్నాయి. కొన్ని చోట్ల వరద నీరు వెళ్లిపోయేందుకు కొంత మంది మ్యాన్‌హోల్ మూతలను తెరిచి పెడుతున్నారు. వరద తగ్గిన తర్వాత ఆ మూతలను వేయడం మర్చిపోతున్నారు. ఏమరపాటుగా ఉంటే, ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. పాదచారులు, ద్విచక్రవాహనదారులకు రాత్రి వేళల్లో ఇది మరింత ప్రమాదకరం.

# కొత్త రైల్వే లైన్లు..

తెలంగాణ: పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో సమీక్ష నిర్వహించారు. వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని.. ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు రైల్వే లైన్ ప్రతిపాదన చేశారు. రీజనల్ రింగ్ రైల్ అవసరం, శంషాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును కూడా పరిశీలించాలని ఆయన అధికారులకు సూచించారు. రైల్వే కనెక్టివిటీ రాష్ట్రానికి ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో వేగంగా ప్రగతిని అందించగలదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అనేక పెండింగ్ ప్రాజెక్టులు ఉండటంతో.. వాటిని పూర్తి చేసి భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా కొత్త లైన్లను ప్రతిపాదించడం అత్యవసరమని సీఎం రేవంత్ రెడ్డి అధికారులు, రైల్వే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశంలో స్పష్టం చేశారు.

వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులపై దృష్టి సారిం చారు. ఈ ప్రాజెక్టును త్వరగా ప్రారంభించే ఒదుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన అభిప్రాయంలో.. రైల్వే మౌలిక వసతులు పూర్తయితే తెలంగాణలో సరుకు రవాణా, ప్రయాణికుల ప్రయాణం రెండింటిలోనూ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుం టాయి. ఇండస్ట్రియల్ సెక్టార్‌లో భవిష్యత్ పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైల్వే లైన్ ఏర్పాటు అవసరమని సీఎం గుర్తు చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే అనుసంధానంతో రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ లైన్ ఏర్పాటుతో పరిశ్రమలకు రా మెటీరియల్ సరఫరా సులభమవడంతో పాటు, ఎగుమతులకు కూడా ఊతం లభిస్తుందని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు.

**రీజనల్ రింగ్ రైల్ ప్రాధాన్యత**

ప్రస్తుతం హైదరాబాద్‌లో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడానికి రీజనల్ రింగ్ రైల్ అవసరమని సీఎం వివరించారు. ఈ రైల్వే లైన్ ఏర్పాటుతో హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాలకు నేరుగా రైల్వే కనెక్టివిటీ లభిస్తుందని... ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయని ఆయన తెలిపారు.

**బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదన..**

సమావేశంలో మరో ముఖ్య అంశంగా శంషాబాద్ నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రతిపాదనను సీఎం ప్రస్తావించారు. ప్రస్తుత రైలు మార్గంతో పోలిస్తే కొత్త లైన్ వల్ల ప్రయాణ దూరం తగ్గి సమయం ఆదా అవుతుందని ఆయన సూచించారు. బుల్లెట్ ట్రైన్ అమలు దక్షిణ భారత రాష్ట్రాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలను మరింతగా బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సమీక్ష సమావేశానికి ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, రోడ్లు భవనాల ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు పలువురు అధికా రులు హాజరయ్యారు. ఈ చర్చల్లో రాబోయే ఐదు నుంచి పది సంవత్సరాల్లో రాష్ట్రం ఎదుర్కొనే రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను విస్తరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. భవిష్యత్‌లో పరిశ్రమలు, ఐటీ రంగం, వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే రైల్వే సౌకర్యాల విస్తరణ అనివార్యమని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణను జాతీయ రవాణా కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీఎం పేర్కొన్నారు.

# ఎక్కడి నుంచైనా టికెట్ బుక్ చేసుకోవచ్చు

తెలంగాణ: ఆలయాల్లో దర్శనం కోసం వెళ్లినా.. మెట్రో ప్రయాణం, పర్యాటక ప్రాంతాలకు వెళ్లినా సరే.. టికెట్ కోసం క్యూలైన్‌లో నిలబడాల్సిందే. రద్దీ ఎక్కువగా ఉంటే గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈ సమస్యకు చెక్ పెట్టడం కోసం తెలంగాణ ప్రభుత్వం మీటికెట్ అంటూ ఓ యాప్‌ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ఆలయాలు, పర్యాటక ప్రదేశాలు, జూపార్క్, మ్యూజియాల్లోకి వెళ్లాలంటే క్యూ లైన్‌లో నిల్చునే అవసరం లేకుండానే.. టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

సినిమా థియేటర్ మొదలు.. ఆలయాలు, పార్క్, ఇతర పర్యాటక ప్రదేశాలకు వెళ్తే కచ్చితంగా టికెట్ తీసుకోవాల్సిందే. అందుకోసం కొన్ని సార్లు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వస్తుంది. ఇది పెద్ద ఇబ్బందికర వ్యవహారం. మరి ఈ సమస్యకు పరిష్కారం లేదా చోట్ల ఈ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఒక్కో చోట ఒక్కో యాప్ ఉంటుంది. అలా కాకుండా ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రాలకు సంబంధించి ఒకే యాప్ ఉంటే.. పర్యాటకులకు చాలా వరకు సమస్యలు తగ్గుతాయి. అలానే సమయం కూడా ఆదా అవుతుంది. దీని కోసం తెలంగాణ ప్రభుత్వమే ప్రత్యేకంగా ఒక యాప్‌ని తీసుకువచ్చింది.

ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రదేశాలకు వెళ్లినప్పుడు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చునే అవసరం లేకుండా.. యాప్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చు. దీని వల్ల చాలా వరకు సమయం ఆదా అవ్వడమే కాక క్యూలైన్‌లో ఉండే బాధ తప్పుతుంది. ఇంతకు అది ఏ యాప్ అంటే.. మీ టికెట్ యాప్. దీన్ని ప్రభుత్వమే తీసుకువచ్చింది. దీని ద్వారా ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలు మాత్రమే కాక జూపార్క్, మ్యూజియం, మెట్రో టికెట్లు కూడా బుక్ చేసుకోవచ్చు. మరి దీనిలో టికెట్ బుక్ చేసుకోవడం ఎలా అంటే..



- ఆ తర్వాత యాప్ ఒపెన్ చేసి మీరు వెళ్లాలనుకున్న ప్లేస్‌ని సెలక్ట్ చేసుకోవాలి.
- ఆ తర్వాత మీకు టికెట్ ఎప్పటికి కావాలో అంటే ఏరోజు టికెట్ కావాలో సెలక్ట్ చేసుకోవచ్చు.
- మీకు కావాల్సిన రోజును సెలక్ట్ చేసుకున్న తర్వాత.. మిగతా డీటెయిల్స్ అంటే ఎంతమంది వెళ్తారు.. మీతోపాటు కెమరాలు కూడా తీసుకు వెళ్లాలనుకుంటే.. ఆ అంశాలను ఫిల్ చేయాలి.
- ఆ తర్వాత పేమెంట్ వస్తుంది. అది కూడా పూర్తయిన తర్వాత టికెట్ బుక్ అవుతుంది.
- ఈ టికెట్లు పని సమయాల్లో మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి.
- అలానే ఈ యాప్‌లో ఈవీ ఛార్జింగ్ ఆప్షన్‌లోకి వెళ్తే.. అవి ఉండే ప్రదేశాలకు దారిని చూపిస్తుంది.
- అలానే గూగుల్ లొకేషన్ ద్వారా మీకు దగ్గరలోనే ఉన్న పర్యాటక ప్రాంతాలను గమినించి సెలక్ట్ చేసుకోవచ్చు.

**లభించే సేవలు..**

ఈ యాప్ ద్వారా 15 ఆలయాల్లో దర్శనం కోసం టికెట్ బుక్ చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది. అలానే మెట్రో, 3 జలశయాలు, 4 జూపార్కులు, పోర్టులు, 5 అడవుల్లో ఉండే క్యాంపు ప్రదేశాలు, 6 మ్యూజియాలు, 7 బోటింగ్ ప్రదేశాలతో పాటుగా నగరాల్లోని ఈవీ ఛార్జింగ్ ప్రదేశాలకు సంబంధించిన వివరాలు, టికెట్ బుకింగ్ సేవలు అందిస్తుంది.

# 'మా ఇంట్లో ఒకడిలా మారాడు..

నిర్మల్: జిల్లాలో ఒక విషాదకర సంఘటన చోటు చేసుకుంది. 23 ఏళ్ల యువకుడు ఒకరు రోడ్డు ప్రమాదంలో చనిపో యారు. అతడు హైకోర్టు జడ్జి శ్రీదేవి గారి వద్ద సహాయ కుడిగా పని చేసేవాడు. దీంతో సహాయకుడు చనిపోయారని తెలుసుకున్న శ్రీదేవి.. అతడి కడసారి చూపు కోసం వచ్చి కన్నీరు మున్నీరుగా విలపించారు. ఉదయ్ అంత్యక్రియల్లో పాల్గొని అతడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఉదయ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా.. కులం, మతం, వృత్తితో సంబంధం లేకుండా.. కొందరు మనుషులతో త్వరగా కనెక్ట్ అయిపోతాం. వారి మీద అంతులేని ఆప్యాయత, అనురాగం పెంచుకుటాము. వారితో క్షణ కాల పరిచయం అయినా సరే జన్మజన్మల అనుబంధంగా ముడిపడి పోతుంది. పరిచయం తక్కువ కాలమే అయినా వారితో మనం పెనవేసుకునే బంధం బలంగా ఉంటుంది. మరి అంతలా అభిమానించే వ్యక్తి దూర మయితే కన్నీరు ఆగనంటూ బయటకు వస్తుంది. వారితో మన పరిచయం తలుచుకుని హృదయం ద్రవిస్తుంది. హోదా, సమాజంలో మన స్థాయి ఇవేవి గుర్తుకు రావు. స్వేచ్ఛగా కన్నీరు బయటకు వస్తుంది. తాజాగా తెలంగాణ హైకోర్టు జడ్జి శ్రీదేవికి ఇదే పరిస్థితి ఎదురయ్యింది. ఆమె వద్ద పని చేసే సహాయకుడు మృతి చెందాడు. దాంతో ఆమె కన్నీరు మున్నీరుగా విలపించారు.

తెలంగాణ హైకోర్టు జడ్జి శ్రీదేవి తన వద్ద పని చేసే సహాయకుడు చనిపోవడంతో బాధతో కన్నీరు పెట్టకున్నారు. అతడి అంత్యక్రియల్లో పాలు పంచుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైకోర్టు జడ్జి జువ్వాడి శ్రీదేవి, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు దంపతుల దగ్గర ఉదయ్ అనే 23 ఏళ్ల యువకుడు పని చేసేవాడు. అతడి స్వస్థలం మామడ మండలం, నల్దుర్తి. అతడికి తల్లిదండ్రులు లేరు. ఈ క్రమంలో గత కొన్నాళ్ల నుంచి ఉదయ్ శ్రీదేవి ఇంట్లో సహాయకుడిగా పని చేస్తున్నాడు. అయితే దురదృష్టవశాత్తు రెండు రోజుల క్రితం అతడు చనిపోయాడు. మంగళవారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అంత్యక్రియల నిమిత్తం ఉదయ్ మృతదేహాన్ని నల్దుర్తికి తరలించారు. బుధవారం నాడు అంత్యక్రియలు నిర్వహించారు. ఈక్రమంలో ఉదయ్‌ని కడసారి చూడటం కోసం జడ్జి శ్రీదేవి నల్దుర్తికి వచ్చారు. ఉదయ్ మృతదేహానికి పూలమాల వేసి.. నివాళులర్పించారు. జీవం లేకుండా ఉన్న ఉదయ్‌ని చూసి ఆమె దుఖాన్ని ఆపుకోలేకపోయారు. కన్నీరు పెట్టుకు న్నారు. తల్లిదండ్రులు లేని ఉదయ్ గత కొన్నాళ్లుగా తమ దగ్గర పని చేస్తున్నాడని చెప్పుకొచ్చారు. చాలా మంచి వాడని.. త్వరగా తన కుటుంబంతో కలిసి పోయి.. మాలో ఒకడిగా మారాడని చెప్పుకొచ్చారు. తక్కువ కాలంలో తమ కుటుంబానికి ఇంత చేరువైన ఉదయ్.. రోడ్డు ప్రమాదంలో మరణించడం తనను తీవ్రంగా కలచి వేసింది.. సొంత కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఉదయ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# రాష్ట్ర సచివాలయంలో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం..

హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో పలు ప్రభుత్వ శాఖల పనులు నిలిచిపోయాయి. ఉదయం నుంచి సేవలు నిలిచిపోవడంతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలో చాలా ప్రాంతాల్లో ఇంటర్నెట్ కేబుల్స్ తెగిపోవడం వల్ల తరచుగా ఇలాంటి అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీనితో ఇంట్లో నుంచి పని చేసే వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అయితే.. ఇంటర్నెట్ కేబుల్స్ తెగిపోవడానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు.



హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఈరోజు ఉదయం నుంచే ఓ పెద్ద సాంకేతిక సమస్యను ఎదుర్కొంది. ప్రధాన కార్యాలయంలో ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో పరిపాలన యంత్రాంగం ఒక్కసారిగా స్థంభించిపోయింది. సాధారణంగా వేగంగా పూర్తయ్యే ఈ–ఆఫీస్ పనులు ఆగిపోవడంతో ఉద్యోగులకే కాకుండా సచివాలయానికి వచ్చే ప్రజలకు కూడా తీవ్రమైన అసౌకర్యం కలిగింది.

**ఉదయం నుంచే ఇబ్బందులు...**

ఆఫీసులు ప్రారంభమైన కొద్దిసేపటికే ఉద్యోగులు నెట్‌వర్క్ పనిచేయకపోవడం గమనించారు. మొదట స్వల్ప లోపమని భావించి ఎదురుచూశారు. కానీ గంటలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. ఫైలు మువ్మెంట్, అనుమతులు, ఆదేశాల పంపిణీ పూర్తిగా ఆగిపోవడంతో విభాగాల మధ్య గందరగోళం నెలకొంది.

**ఉద్యోగుల ఆవేదన..**

ట్రెజరీ, రెవెన్యూ, ఫైనాన్స్, ఐటి శాఖల్లో సమస్యలు ఎక్కువయ్యాయి. రోజువారీ కార్యకలాపాలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడటంతో.. చిన్న పనులకే ఎక్కువ సమయం పట్టింది. ఫైళ్లు ఆమోదం కోసం సచివాలయానికి వచ్చిన ప్రజలు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పనులు జరగకపోవడంతో పదేపదే రావాల్సి రావడం వల్ల సమయం వృథా అవుతోందని వారు అసహనం వ్యక్తం చేశారు.

**కారణంపై సందేహాలు..**

ఇంటర్నెట్ నిలిచిపోవడానికి గల అసలు కారణంపై అధికారిక ప్రకటన రాలేదు. ఇది సాధారణ సాంకేతిక లోపమా లేదా ఎలాంటి సైబర్ సమస్యా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఐటి అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించే పనిలో ఉన్నారని సమాచారం. త్వరలోనే సేవలు పునరుద్ధరించబడతాయని వారు హామీ ఇస్తున్నారు.

**టెక్నాలజీపై అధిక ఆధారపడిన పరిపాలన**

ప్రస్తుతం సచివాలయంలో దాదాపు అన్ని ప్రక్రియలు డిజిటల్ విధానంలోనే నడుస్తున్నాయి. ఫైల్ క్లియరెన్స్, ఆర్థిక లావాదేవీలు, పరిపాలనా ఆమోదాలు అన్నీ ఈ–ఆఫీస్ ద్వారానే జరుగుతున్నాయి. అలాంటి సమయంలో ఇంటర్నెట్ నిలిచిపోవడంతో మొత్తం పరిపాలన ఒక్కసారిగా స్తంభించింది. ఇది మళ్లీ పాత మాన్యువల్ వ్యవస్థకు వెళ్ళినట్టుగా ఉందని కొందరు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం హైదరాబాద్ లో ఎక్కడో ఒక చోటు నెట్ కేబుల్స్ తెగిపోతున్నాయని.. ఇటువంటి అంతరాయాల నడుమ తాము వర్క్ ఫ్రం ఎలా చేయాలి అంటూ సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# అంచనాలకుమించి రాణించిన ఇన్ఫోసిస్



దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక లాభంలో 11.46 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకు మించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక లాభంలో 11.46 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. ఐటీ సేవలకు డిమాండ్ ఊపందుకోవడం, వార్షిక విక్రయాల అంచనా మూడోసారి పెంచడం సంస్థకు కలిసొచ్చింది.

అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.6806 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.6,106 కోట్ల లాభంతో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధించింది. అలాగే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం అధికమై రూ.41,764 కోట్లుగా నమోదైంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయంలో 4.5-5 శాతం వరకు పెరుగుదలవుండవచ్చునని గైడెన్స్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ..ఆర్థిక సేవలతోపాటు రిటైల్, కన్స్యూమర్ ప్రొడక్ట్స్ రంగంలో మార్పులు అధికంగా చోటు చేసుకుంటున్నాయని, దీంతో ఈ ఏడాది ఆదాయ వృద్ధిలో అంచనాను సవరించినట్లు చెప్పారు.

కంపెనీ మొత్తం ఆదాయంలో బీఎఫ్ఎస్ఐ నుంచి మూడోవంతు సమకూరుతున్నదని, అత్యధికంగా సమకూరుతున్న అమెరికాలో 6.1 శాతం వృద్ధిని కనబరిచినట్లు చెప్పారు.

## పరుగుపెడుతున్న బంగారం ధరలు

బంగారం ధరలు మళ్లీ పరుగుపెడుతున్నాయి. ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, రూపాయి పతనం చెందడంతో పుత్తడి ధరలు రివ్వున ఎగిశాయి. బంగారం ధరలు మళ్లీ పరుగుపెడుతు న్నాయి. ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, రూపాయి పతనం చెందడంతో పుత్తడి ధరలు రివ్వున ఎగిశాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.500 ఎగబాకి రూ.81,300కి చేరుకున్నది.

దీంతో ఈ ధరలు రెండు నెలల గరిష్ఠ స్థాయిని తాకయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. బంగారంతోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.2,300 ఎగబాకి రూ.94 వేలు పలికింది.

మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 318.74 పాయింట్లు ఎగబాకి 77 వేలు అధిగమించి 77,042.82 వద్ద నిలువగా, నిఫ్టీ 98.50 పాయింట్లు అందుకొని 23,311.80 వద్ద నిలిచింది.

## హిండెన్‌బర్గ్ రిసెర్చ్ మూతబడింది..

ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీని వెనక్కినెట్టి.. అగ్రస్థానంలో నిలబడ్డ గౌతమ్ అదానీ ఒక్కసారిగా కూలబడ్డారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆయనకు చెందిన సంస్థల షేర్లన్నీ భీకర నష్టాల్లోకి జారుకున్నాయి. గంటల వ్యవధిలో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ హరించుకుపోయింది. లక్షల కోట్ల రూపాయల నష్టాలతో అదానీ వ్యక్తిగత సంపద కూడా కనుమరుగైపోయింది. భారతీయ స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ సంస్థలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ రెండేండ్ల క్రితం విడుదలైన ఓ సంచలన నివేదికే ఇందుకు కారణం. స్టాక్ మార్కెట్లలో నమోదైన 10 అదానీ గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ కేవలం నెల రోజుల్లోనే రూ.19.19 లక్షల కోట్ల నుంచి రూ.7 లక్షల కోట్లకు దిగజారింది. ఇందులో వ్యక్తిగతంగా గౌతమ్ అదానీకే దాదాపు రూ.9 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో ఈ రిపోర్టునిచ్చిన హిండెన్‌బర్గ్ పేరు దేశ, విదేశాల్లో మార్మోగిపోయింది. కాగా, హిండెన్‌బర్గ్ మూసివేత.. అదానీ, మోదీ సర్కారుకు క్లీన్‌చిట్‌గా భావించరాదని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అంటున్నది. మరోవైపు ఎందరో వచ్చారు.. ఎందరో పోయారు అంటూ అదానీ వ్యాఖ్యానించింది. అయితే స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ షేర్లు భారీ లాభాలను అందుకోవడం గమనార్హం. హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను 2017లో నాథన్ అండర్సన్ ప్రారంభించారు. కనెక్టీకట్ యూనివర్సిటీలో అంతర్జాతీయ వ్యాపార నిర్వహణ విద్యనభ్యసించిన ఆయన అమెరికాకు రాకముందు జెరూసలేంలో ఉండేవారు. ఓ ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో కన్సల్టింగ్ జాబ్‌ను చేసిన అండర్సన్.. కేవలం 11 మంది ఉద్యోగులతో ఇన్నాళ్లూ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ కార్యకలాపాలను నడిపించడం గమనార్హం. కాగా, అమెరికాలోని లార్డ్స్‌టౌన్ మోటర్స్ కార్ప్, క్లోవర్ హెల్త్, చైనాకు చెందిన కాండీ, కొలంబియా సంస్థ టెక్నోగ్లాస్‌లపై గతంలో హిండెన్‌బర్గ్ రిపోర్టులు పేలాయి. 2023లో ఇకాన్ ఎంటర్‌ప్రైజెస్, బ్లాక్ కంపెనీలనూ షార్ట్ చేసింది. ఇక అదానీ గ్రూప్‌పై విధ్వంసం తెలిసిందే. అయితే అంతకుముందే భారత్‌కు చెందిన ఎరోస్ ఇంటర్నేషనల్ సంస్థపై హిండెన్‌బర్గ్ దాడులు జరిగాయి. టార్గెట్ కంపెనీల అక్రమాలు, అంతర్గత వ్యవహారాలు, లుకలుకల్ని కనిపెట్టి రిపోర్టులను సిద్ధం చేయడమే హిండెన్‌బర్గ్ పని. ఆ తర్వాత తమ భాగస్వాములతో కలిసి అదే సంస్థల్లో షార్ట్ పొజీషన్లు తీసుకుంటుంది. ఆపై సదరు రిపోర్టులను విడుదల చేస్తుంది. దీంతో స్టాక్ మార్కెట్లలో ఆయా కంపెనీల షేర్లు పడిపోగానే లాభాల్ని చేజిక్కించుకుంటుంది. అమెరికా ట్రేడెడ్ బాండ్లు, నాన్ ఇండియన్ ట్రేడెడ్ డెరివేటివ్ సాధనాల ద్వారా అదానీ గ్రూప్ సంస్థల్లో హిండెన్‌బర్గ్‌కు షార్ట్ పొజీషన్లున్నాయి. అదానీపై రిపోర్టుతో షార్ట్ సెల్లింగ్‌కు దిగి హిండెన్‌బర్గ్ బాగానే సంపాదించింది. కాగా, అదానీ గ్రూప్‌లోని వివిధ స్టాక్ మార్కెట్ నమోదిత కంపెనీల రుణం పెద్ద ఎత్తున ఉన్నదని, ఇది మొత్తం గ్రూప్ ఆర్థిక పరిపుష్ఠినే దెబ్బతీయగలదని హిండెన్‌బర్గ్ తమ రిపోర్టులో పేర్కొన్నది. ఈ క్రమంలో హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు ఇవ్వగా, అదానీ అక్రమాల్లో సెబీ చీఫ్ మాధవీపురి బచ్ దంపతుల పాత్ర కూడా ఉందంటూ ఆ సంస్థ సంచలన ఆరోపణలు చేసింది. మరోవైపు అమెరికాలో అదానీపై కేసులు నమోదయ్యాయి. త్వరలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనుండటంతో దీనిపై గట్టిగానే విచారణలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హిండెన్‌బర్గ్ షట్‌డౌన్ ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. విచారణల భయంతోనే మూసేశారా? అన్న సందేహాలూ తలెత్తుతున్నాయి. మా దర్యాప్తు ప్రాజెక్టులన్నీ పూర్తయ్యాయి. చివరి కేసును ముగించిన రోజే సంస్థనూ మూసేద్దామని గతంలోనే నిర్ణయించుకున్నాం.

## ఈసారి జీడీపీ 6.4 శాతమే..

భారత్ వృద్ధికి ఫిక్కీ కోతలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగానే ఉండొచ్చని గురువారం దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ ఎకనామిక్ ఔట్‌లుక్ సర్వే అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగానే ఉండొచ్చని గురువారం దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ ఎకనామిక్ ఔట్‌లుక్ సర్వే అంచనా వేసింది. అంతకుముందు ఇది 7 శాతంగా ఉంటుందని పేర్కొనగా.. ఇప్పుడు అర శాతానికిపైగా కుదించడం గమనార్హం. ఇక 2023-24 దేశ జీడీపీ వృద్ధిరేటు 8.2 శాతంగా ఉన్నది. ఈ క్రమంలో తాజా అంచనా మరింతగా వృద్ధిపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. గత నెల డిసెంబర్‌లో ప్రముఖ ఆర్థికవేత్తలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ నిపుణుల నుంచి సేకరించిన స్పందనలు, అభిప్రాయాల ఆధారంగా ఈ సర్వేను ఫిక్కీ చేపట్టింది.

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందన్న దానిపై నిపుణులు స్పందిస్తూ.. స్వల్ప కాలంలో ఎగుమతులు,





విదేశీ పెట్టుబడులు మందగించవచ్చన్నారు. ఇక అధిక సుంకాలు, వీసా నిబంధనలు కూడా కొంత ఇబ్బందికరమేనన్నారు. రూపాయి మారకం విలువ స్థిరత్వాన్ని కోల్పోవచ్చని చెప్తున్నారు. ఇదిలావుంటే వ్యవసాయోత్పత్తి పెంపు, మెరుగైన గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, గిడ్డంగుల వ్యవస్థ బలోపేతం వంటివి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించగలవని సూచించారు.

## రిలయన్స్ లాభం 18,540 కోట్లు.. క్యూ3లో 7.4 శాతం పెరిగిన ప్రాఫిట్

దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఆశాజనక పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికపు నికర లాభంలో 7.4 శాతం వృద్ధి నమోదైనట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఆశాజనక పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికపు నికర లాభంలో 7.4 శాతం వృద్ధి నమోదైనట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. రిటైల్ వ్యాపారంతోపాటు టెలికం విభాగం అంచనాలకుమించి రాణించడం వల్లనే లాభాల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.18,540 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.13.70 చొప్పున ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.17,265 కోట్ల లాభం లేదా ప్రతిషేరుకు రూ.12.76తో పోలిస్తే సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.27 లక్షల కోట్ల నుంచి రూ.2.43 లక్షల కోట్లకు ఎగబాకింది. రూ.3.5 లక్షల కోట్లకు చేరుకున్న రుణాలకోసం సంస్థ అధికంగా చెల్లింపులు జరపడం వల్లనే లాభాలు భారీగా పుంజుకోలేకపోయాయని కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికం నాటికి కంపెనీకి రుణాలు రూ.3.36 లక్షల కోట్లు, ఏడాది క్రితం ఇదే త్రైమాసికం నాటికి రూ.3.11 లక్షల కోట్లుగా ఉన్నాయి.

జియో లాభంలో 24 శాతం వృద్ధి

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో మరోసారి భారీ లాభాలను ఆర్జించింది. గత త్రైమాసికపు లాభంలో 24 శాతం వృద్ధిని సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.6,231 కోట్లుగా ఉన్న స్టాండలోన్ నికర లాభం గత త్రైమాసికానికిగాను 24.24 శాతం ఎగబాకి రూ.6,477 కోట్లకు చేరుకున్నది. కంపెనీ



ఆదాయం రూ.25,368 కోట్ల నుంచి రూ.29,307 కోట్లకు ఎగబాకింది. డాటా వినిమయం ఊపందుకోవడం, సరాసరిగా డాటాపై వచ్చే ఆదాయం పెరగడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు 48.21 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. సరాసరి ఒక్కో కస్టమర్‌పై రూ.200 ఆదాయం సమకూరింది. రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ.3,458 కోట్లు ఆర్జించింది.

గత త్రైమాసికంలో కొత్తగా 779 స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం రిటైల్ స్టోర్ల సంఖ్య 19,102కి చేరుకున్నాయి. గత త్రైమాసికంలో రికార్డు స్థాయి ఎబిటా మార్జిన్లు ఆర్జించినట్లు, నికర లాభంలో కన్సాలిడేటెడ్ స్థాయికి చేరుకున్నది. డిజిటల్ సర్వీసులు, టెలికం సేవలకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లావడం కలిసొచ్చింది.

## పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్లు, ఆయన సతీమణికి 7 ఏళ్ల జైలు శిక్ష..



అల్ ఖాదిర్ ట్రస్టు భూమి అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష పడింది. అలాగే ఆయన భార్య బుష్రా బీబీకి 7 ఏళ్లపాటు జైలు శిక్ష విధించింది అక్కడి న్యాయస్థానం. అంతేకాకుండా వీరిద్దరికి వరుసగా పది లక్షలు, ఐదు లక్షల జరిమానాను కూడా విధించింది. ఈ జరిమానాలు చెల్లించకపోతే మరో ఆరు నెలల పాటు అదనంగా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని చెప్పింది. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

అల్ ఖాదిర్ ట్రస్టు భూ అక్రమాస్తుల కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆయన భార్య బుష్రా బీబీని దోషులుగా తేల్చింది పాక్ ట్రిబ్యునల్ కోర్టు. ఈక్రమంలోనే ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆయన సతీమణికి ఏడు సంవత్సరాల శిక్ష వేసింది. అంతేకాకుండా ఇమ్రాన్ ఖాన్‌కు 10 లక్షల రూపాయల జరిమానాను కూడా విధించింది. బుష్రా బీబీకి 5 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ ఈ జరిమానాలను చెల్లించకపోతే ఇద్దరూ అదనంగా మరో ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం బీబీ బుష్రాను అదుపులోకి కూడా తీసుకున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలు చేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్‌కు పంపగా.. ఆ సొమ్మును ఇమ్రాన్ ఖాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని ఆరోపణ వచ్చింది. దీన్నే అల్ ఖాదిర్ ట్రస్టు కేసుగా చెబుతుండగా.. నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. అయితే ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో.. ఈ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్ హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని అందులోంచి కట్టేందుకు అనుమతించారని అభియోగాలు వచ్చాయి.

అయితే ఇందుకు బదులుగా ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలు నెలకొల్పాలని చూసిన అల్ ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాల భూమి బహుమానంగా ఇచ్చినట్లు కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో గతేడాది డిసెంబర్ 23వ తేదీనే ఇస్లామాబాద్ అకౌంటబులిటీ కోర్టు తీర్పు ఇవ్వాల్సి ఉంది. కానీ పలుకారణాలు వల్ల వాయిదా పడుతూ వచ్చింది.

అయితే ఈరోజు అడియాలా జైల్లో ఏర్పాటు చేసిన కోర్టు గదిలో జడ్జి నాసిర్ జావెద్ రాణా ఈ తీర్పునిచ్చారు. ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆయన భార్య బుష్రా బీబీలకు.. వరుసగా 14, 7 ఏళ్ల జైలు శిక్షను విధించారు. అంతేకాకుండా వరుసగా 10, 5 లక్షల రూపాయల జరిమానా వేశారు. వీరిద్దరూ ఈ జరిమానాలు చెల్లించకపోతే అదనంగా మరో ఆరు నెలల పాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా.. రెండేళ్లుగా జైల్లోనే ఉంటున్న ఇమ్రాన్ ఖాన్‌పై అనేక లీగల్ కేసులు నమోదు కాగా.. అవన్నీ రాజకీయ కక్షలతోనే నమోదు చేసినట్లు ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. ఈక్రమంలోనే తోషాకానా, ఇద్దత్ కేసుల్లో గతేడాది నిర్దోషిగా తేలిన ఈయనపై తాజాగా తోషాకా2 కేసు నమోదు అయింది. అలాగే 2024 జనవరి నెలలో ప్రభుత్వ రహస్యాలను బహిర్గతం చేసిన కేసులో పాకిస్థాన్ కోర్టు 10 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ప్రస్తుతం 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అయితే పాకిస్థాన్ చట్టం ప్రకారం ఏక కాలంలో అనేక శిక్షలను అనుభవించవచ్చు. అంటే 14 ఏళ్లలోనే ఆయన అన్ని శిక్షలను పూర్తి చేయవచ్చన్నమాట.

## తెలుగు సంతతి యువకుడికి 8 ఏళ్లు జైలు

ఓ యువకుడు అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ట్రక్కుతో దాడి చేసిన ఘటన యావత్తు ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. ప్రపంచంలోనే అత్యంత భద్రత కలిగిన వైట్‌హౌస్ వద్ద ఈ ఘటన జరగడంతో షాకయ్యారు. ఈ ఘటనలో భారత సంతతి మూలాలున్న తెలుగు యువకుడి అరెస్టయ్యాయడు. 20 ఏళ్ల కందుల సాయి వర్షిత్‌ను యూఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణలో భాగంగా సాయి వర్షిత్ పోలీసులకు అతడు సంచలన విషయాలను వెల్లడించాడు. రెండేళ్ల కిందట అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం వద్ద భారత సంతతికి చెందిన యువకుడు.. ట్రక్కుతో దాడికి యత్నించిన ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు, తెలుగు సంతతికి వ్యక్తి కందుల సాయి వర్షిత్ ను అక్కడి పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, ఈ కేసులో అమెరికా న్యాయస్థానం తీర్పును వెలువరించింది. నిందితుడు సాయి వర్షిత్‌ను దోషిగా నిర్ధారించి.. అతడికి 8 ఏళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. నాజీ భావజాలంతో విద్వేషాన్ని పెంచుకున్న యువకుడు.. డెమొక్రటిక్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు యత్నించాడని న్యాయమూర్తి డాబ్నీ ఫ్రెడ్రిచ్ వెల్లడించారు. పేర్కొన్నారు.

"ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని నాజీ భావజాలంతో కూలదూయాలనే దురుద్దేశంతో సాయివర్షిత్ ఈ దాడికి ప్రయత్నించాడు.. అవసరమైతే అధ్యక్షుడి ప్రాణాలు కూడా తీయాలని నిర్ణయించుకున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతడికి ఎనిమిదేళ్లు శిక్ష విధించాలని నిర్ణయించాం... అతడి చర్యల కారణంగా ధ్వంసమైన నిర్మాణాల తొలగింపు, పునర్నిర్మాణం ఖర్చులు సహా నేషనల్ పార్క్ సర్వీస్‌కు 4,322 అమెరికా డాలర్ల (సుమారు రూ.3,74,000) నష్టం వాటిల్లింది" అని న్యాయస్థానం అభిప్రాయపడింది.

న్యాయస్థానం వెలువరించిన పత్రాల ప్రకారం.. నిందితుడు సాయి వర్షిత్ 2023 మే 22న మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నుంచి బయలుదేరి.. అదే రోజు సాయంత్రం 5.20 గంటలకు వాషింగ్టన్ డీసీకి చేరుకున్నాడు.. అనంతరం అక్కడ ఓ ట్రక్కును అద్దెకు తీసుకొని రాత్రి 9.35 గంటల సమయంలో శ్వేతసౌధం వద్ద ఫుట్‌పాత్‌పైకి వాహనంతో దూసుకొచ్చాడు. దీంతో భయాందోళనకు గురైన పాదచారులు పరుగులు తీశారు.. ఆ తర్వాత వైట్‌హౌస్ ఉత్తరభాగంలో భద్రత కోసం ఏర్పాటుచేసిన బారికేడ్లను ఢీకొట్టాడు. మళ్లీ ట్రక్కును రివర్స్ చేసి ఢీకొట్టిన అనంతరం వాహనం నుంచి దిగి నాజీ జెండాను పట్టుకొని నినాదాలు చేశాడు. ఈ సమయంలో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ఉద్దేశపూర్వకంగానే దాడిచేశాడని, అధ్యక్షుడు జో బైడెన్‌ను హత్య చేయాలనే లక్ష్యంతో వచ్చాడని అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం అతడు ఆరు నెలలుగా ప్రణాళిక వేసి ఈ ఘటనకు పాల్పడినట్లు తేలింది. మే 4, 2023లో భారీ వాణిజ్య ట్రక్కుల అద్దె కోసం ఎంక్వైరీ చేశాడని చెప్పారు. విచారణలో నిందితుడు సాయి వర్షిత్ దీనిని అంగీకరించినట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ వర్గాలు మీడియాకు వెల్లడించాయి. దీంతో అతడ్ని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

## నా కొడుకును ఓపెన్ ఏఐ హత్య చేసింది..

### సుచీర్ బాలాజీ తల్లి పూర్ణిమ సంచలన ఆరోపణలు



గతేడాది నవంబరు 26న శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో భారత సంతతికి చెందిన టెకీ సుచీర్ బాలాజీ మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే, ప్రాథమిక విచారణ అనంతరం దీన్ని ఆత్మహత్యగా అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, కుమారుడి మృతిపై అతడి అమ్మ పూర్ణిమరావు న్యాయపోరాటానికి దిగారు.

ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన భారతీయ అమెరికన్ సుచీర్ బాలాజీ అంశం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా, బాలాజీ తల్లి పూర్ణిమ రావు సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడ్ని ఓపెన్ఏఐ సంస్థ హత్యచేసిందని ఆరోపించారు. ఓపెన్ఏఐకి వ్యతిరేకంగా తన కొడుకు వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వారు ఏమి చేస్తున్నారనేది మొత్తం సమాచారం బాలాజీకి తెలుసని పేర్కొన్నారు. తమ సంస్థ రహస్యాలు బయటపడకుండా ఉండాలనే కారణంతోనే తన కొడుకును చంపేశారని వ్యాఖ్యానించారు. టక్కర్ కార్లసన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో పూర్ణిమరావు మాట్లాడుతూ.... ఆమె తన కుమారుడి మరణం, కృత్రిమ మేధకు సంబంధించి పలు అంశాలను వెల్లడించారు. 'నా కొడుకు చనిపోవడానికి ఒక రోజు ముందు పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నాడు.. ఒకవేళ అతడు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే జన్మదిన వేడుకలు చేసుకునేవాడా? ఆ ఉద్దేశమే ఉంటే తండ్రి పంపిన పుట్టినరోజు జన్మదిన కానుకలను బాలాజీ చనిపోయే రోజు ఎలా అందుకుంటాడు' అని అనుమానాలు వ్యక్తం చేశారు. "ఓపెన్ఏఐకి వ్యతిరేకంగా బాలాజీ వద్ద ఆధారాలు ఉన్నాయి. అందుకే చంపేశారు.. అతడి అపార్టుమెంట్‌లో కొన్ని డాక్యుమెంట్లు కనిపించడం లేదు. చాట్‌జీపీటీ రూపకర్తలు విచారణను ప్రభావితం చేశారు... ఈ విషయం గురించి తెలిసిన వ్యక్తులను తమ అధీనంలో ఉంచుకున్నారు.. అందుకే నిజం చెప్పడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.. లాయర్లు సైతం ఆత్మహత్యగా చెబుతున్నారు.. కేవలం 14 నిమిషాల వ్యవధిలోపే సుచీర్ బాలాజీ మృతిని ఆత్మహత్యగా అధికారులు తేల్చారు" అని పూర్ణిమ వాపోయారు.

ఇదే సమయంలో అధికారులపై కూడా ఆరోపణలు చేశారు. పూర్తి సమాచారం చెప్పడం లేదని, వాళ్లు పారదర్శకంగా వ్యవహరించడం లేదని పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఇంటర్వ్యూ వీడియోను ఎక్స్‌లో పోస్టుచేసిన ఎలాన్ మస్క్.. ఇది తీవ్రమైన ఆందోళన కలిగించేదిగా ఉందని అన్నారు. కాగా, బాలాజీ ఆత్మహత్యపై మస్క్ ముందు నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

## హెచ్1బీ వీసాలపై చర్చలు..

భారతదేశానికి చెందిన అనేక మంది అగ్రరాజ్యం అమెరికాకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తారు. అక్కడైతే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని.. ఇంటి ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ఎక్కువ మొత్తంలో బ్యాంకు రుణాలు తీసుకుంటూ స్టూడెంట్ వీసాలపై యూఎస్ వెళ్తుంటారు. అలా వెళ్లిన వారంతా ప్రస్తుతం అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు. ముఖ్యంగా మరో మూడు రోజుల్లో.. ఇటీవలే అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించబోతుండగా.. యూఎస్‌లో ఆశ్రయం పొందేందుకు దరఖాస్తులు చేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు.

ఇటీవలే అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. మరో మూడు రోజుల్లో పదవీ బాధ్యతలు స్వీకరించబోతుండగా.. అమెరికాలో ఆశ్రయం కోసం దరఖాస్తులు చేసుకునేందుకు భారతీయ విద్యార్థులు ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యూఎస్‌లో ఉండే ఇమ్మిగ్రేషన్ లాయర్లు, ఏజెంట్లే ఈ విషయాన్ని వెల్లడించారు. గత ఆరు వారాల్లోనే 50కి పైగా మంది భారతీయ విద్యార్థులు యూఎస్‌లో ఆశ్రయం పొందేందుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నించినట్లు చెప్పారు. స్టూడెంట్ వీసాలపై అమెరికాకు వెళ్లిన అనేక మంది భారతీయ విద్యార్థులు.. మరికొన్ని రోజుల్లోనే కోర్సులు పూర్తి చేయబోతున్నట్లు తెలుస్తోంది. అలాగే తమకు హెచ్1బీ వీసాలు సలువుగా వచ్చేందుకు పెట్టే ఆప్షనల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను తీసేస్తే.. వీసాలు రాక తిరిగి ఇంటికి వెళ్లిపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇదే జరిగితే యూఎస్‌లో ఆశ్రయం కోసం దరఖాస్తులు చేసుకోవాలని వారు భావిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే ఆశ్రయం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలంటూ విద్యార్థులు లాయర్లు, ఏజెంట్ల వద్దకు వెళ్తున్నారట. విద్యార్థులు రుణాలు పొంది అమెరికాకు రావడంతో.. మరింత ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. కానీ అమెరికాలో ఆశ్రయం పొందేందుకు విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇమ్మిగ్రేషన్ లాయర్లు చెబుతున్నారు.ఆశ్రయం కోసం దరఖాస్తును పూర్తి చేయాల్సి ఉంటుందని.. ఇదంతా చాలా కష్టమైన పని అంటూ వివరించారు. గుజరాత్ నుంచి అమెరికాకు వెళ్లి చదువుకుంటున్న ఓ 24 విద్యార్థి దీనిపై స్పందిస్తూ.. ట్రంప్ బాధ్యతలు స్వీకరించడం, స్టెమ్ గ్రాడ్యుయేట్‌ల కోసం పొడగించే అవకాశం ఉందని.. దీని వల్ల వీసా వ్యవధి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.



# వారసుడు కావాలనే కోరిక నెరవేరిన వేళ..

కొణిదెల వారి ఇంట వారసుడు జన్మించాడు. వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు మగబిడ్డకు జన్మనివ్వడంతో మెగా కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. మనవడిని ఎత్తుకుని మురిసిపోయిన చిరంజీవి.. కొణిదెల ఫ్యామిలీలోకి చిన్నారికి స్వాగతం పలుకుతూ ఆశీర్వదించారు. నాగబాబు, పద్మజలు తాతయ్య - నానమ్మలుగా మారారంటూ సంతోషం వ్యక్తం చేశారు.

మెగా ఫ్యామిలీలోకి మరో వారసుడు వచ్చిన సంగతి తెలిసిందే. మెగా కపుల్ వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తనకు మనవడు పుట్టడంపై మెగాస్టార్ చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. కొణిదెల ఫ్యామిలీలోకి చిన్నారికి స్వాగతం పలుకుతూ, తల్లిదండ్రులైన వరుణ్-లావణ్యకు అభినందనలు తెలిపారు. నాగబాబు-పద్మజలు నానమ్మ-తాతయ్యలుగా ప్రమోట్ అవ్వడం ఆనందంగా ఉందన్నారు. బిడ్డ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షింస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

"చిన్నారికి స్వాగతం. కొణిదెల కుటుంబంలో పుట్టిన నవజాత శిశువుకు హృదయపూర్వక స్వాగతం. తల్లిదండ్రులు అయినందుకు వరుణ్ తేజ్ - లావణ్య త్రిపాఠికి నా అభినందనలు. నాగబాబు, పద్మజలు గ్రాండ్ పేరెంట్స్ గా ప్రమోట్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఆ బిడ్డకు అన్ని రకాల ఆనందం, మంచి ఆరోగ్యం, అందరి ఆశీస్సులు సమృద్ధిగా ఉండాలని కోరుకుంటున్నాను. మీ ప్రేమ, ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ మా బిడ్డను ఉండాలని ఆశిస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారితో దిగిన ఫొటోను షేర్ చేశారు.

చిరంజీవి షేర్ చేసిన ఫోటోలో ఆయన ప్రేమగా తన మనవడిని ఎత్తుకొని కనిపిస్తున్నారు. పక్కనే ఉన్న వరుణ్ తేజ్ తన కుమారుడిని చూస్తూ సంబరపడిపోతున్నారు. చిరు ఆ బిడ్డవైపే చూస్తూ మురిసిపోతున్నారు. 'బ్రహ్మ ఆనందం' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చిరంజీవి తనకు వారసుడు కావాలనే తన మనసులోని కోరిక వెలిబుచ్చారు. ఇప్పుడు మెగాస్టార్ కళ్లలో ఆనందం చూస్తుంటే, కొణిదెల వారసుడు కావాలనే ఆయన కోరిక నెరవేరునట్లు ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# కళ్లు చెదిరే రేటుకి 'అఖండ 2'

నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'అఖండ 2: తాండవం'. 'అఖండ' సీక్వెల్ గా రూపొందుతున్న ఈ పాన్ ఇండియా సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిద్దరి కాంబోలో గతంలో వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌లుగా నిలిచాయి. దీంతో 'అఖండ 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికి తగ్గట్టుగానే ఈ మూవీ ఓటీటీ రైట్స్ భారీ ధరకు అమ్ముడైనట్లుగా వార్తలు వస్తున్నాయి.

'అఖండ 2: తాండవం' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ దక్కించుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. రూ. 80 - 85 కోట్ల మధ్య డీల్ క్లోజ్ అయినట్లుగా టాక్ నడుస్తోంది. సినిమాపై నెలకొన్న హైప్ దృష్ట్యా భారీ రేటుకు ఓటీటీ రైట్స్ తీసుకోడానికి నెఫ్ ఫ్లిక్స్ వెనకాడలేదని అంటున్నారు. బాలయ్య నటించిన 'డాకు మహారాజ్' సినిమా డిజిటల్ హక్కులను కూడా నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.



# సితార చెంతకు తండేల్ డైరెక్టర్..



భారతీయ చిత్ర పరిశ్రమలో మైథలాజికల్ చిత్రాల ట్రెండ్ కొనసాగుతుండగా, సితార ఎంటర్టైన్మెంట్స్ 'వాయుపుత్ర' పేరుతో భారీ యానిమేషన్ చిత్రాన్ని ప్రకటించింది. 'మహావతార్ నరసింహ' సంచలన విజయం సాధించడంతో, నాగవంశీ అదే తరహాలో హనుమంతుడి కథతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో 2026 దసరాకు విడుదల కానుంది.

ఇండియన్ సినిమాలో గత కొన్నేళ్లుగా మైథలాజికల్, హిస్టారికల్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. పురాణాలు, ఇతిహాసాలు, చారిత్రాత్మక కథలతో తెరకెక్కిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ విజయాలు సాధిస్తున్నాయి. అందుకే ఫిలిం మేకర్స్ అందరూ అలాంటి సినిమాలు తీయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. భారీ బడ్జెట్లు ఖర్చు చేయడానికి నిర్మాతలు రెడీ అయిపోతున్నారు. ఇటీవల యానిమేషన్ లో తీసిన 'మహావతార్ నరసింహ' ఎంతటి సంచలనం సృష్టించిందో మనం చూశాం. రూ. 40 కోట్లతో రూపొందించిన ఈ చిత్రం.. రూ. 320 కోట్లకు పైగా వసూళ్లను సాధించి భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన యానిమేషన్ మూవీగా రికార్డ్ క్రియేట్ చేసింది. దీంతో ఇప్పుడు టాలీవుడ్ ప్రొడ్యూసర్ నాగవంశీ కూడా అదే తరహాలో ఓ కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు.సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో 'వాయుపుత్ర' అనే పేరుతో తాజాగా ఓ భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు.

ఇది కేవలం మరొక సినిమా మాత్రమే కాదని, ఇది ఓ అద్భుతమైన దృశ్య కావ్యమని పేర్కొన్నారు. "మన చరిత్ర యొక్క ఆత్మ నుంచి, మన ఇతిహాసాల పుటల్లో నుంచి పుట్టిన ఒక గొప్ప లెజెండ్ కథతో వస్తోంది. 'వాయుపుత్రబీ కేవలం సినిమా కాదు.. ఇది పవిత్ర దృశ్య కావ్యం. యానిమేషన్‌లో తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల అవుతుంది" అని మేకర్స్ తెలిపారు. 2026 దసరా పండక్కి ఈ ఎపిక్ మూవీని థియేటర్లలో ఎక్స్ పీరియన్స్ చేయండి అని పోస్ట్ పెట్టారు. 'వాయుపుత్ర' చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. దీనికి చందూ మొండేటి దర్శకత్వం వహించనున్నారు. హనుమంతుడి కథతో యానిమేషన్ లో ఈ సినిమాని తెరకెక్కించనున్నారని చిత్ర బృందం సోషల్ మీడియాలో లాంచ్ చేసిన పోస్టర్ తో క్లారిటీ వచ్చేసింది.

# రూ.30 కోట్ల బడ్జెట్.. రూ 200 కోట్ల కలెక్షన్స్..



భారతదేశపు మొట్టమొదటి మహిళా సూపర్ హీరో మూవీగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'కొత్త లోక 1: చంద్ర'. కళ్యాణి ప్రియదర్శన్, నస్లెన్ కె. గఫూర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్ పై మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించారు. తెలుగులో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత సూర్యదేవర నాగవంశీ విడుదల చేశారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా.. బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. మలయాళ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది.

డొమినిక్ అరుణ్ దర్శకత్వంలో 'లోకా చాప్టర్ 1: చంద్ర' చిత్రం తెరకెక్కింది. ఆగస్టు 29న మలయాళంలో రిలీజ్ అయింది. ఆ తర్వాత తెలుగులో 'కొత్త లోక 1: చంద్ర' పేరుతో విడుదలైంది. హిందీలోకి కూడా డబ్ చేయబడింది. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా మొదటి వారంలోనే రూ.100 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి సంచలనం సృష్టించింది. 10 రోజుల్లో రూ.160 కోట్లు వసూలు చేసింది. తాజాగా ఈ చిత్రం రూ. 200 కోట్ల క్లబ్ లో చేరినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా 13 రోజుల్లో రూ. 202 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టినట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. 'లోకా చాప్టర్ 1: చంద్ర' చిత్రానికి రూ.30 కోట్ల బడ్జెట్ ఖర్చు అయినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. రెండు వారాల్లోనే రూ. 200 కోట్లు వసూలు చేసి దుల్కర్ సల్మాన్ కు భారీ లాభాలను తెచ్చిపెట్టింది. ఇప్పటి వరకూ మలయాళ చిత్ర పరిశ్రమలో ఎంపురాన్', 'మంజుమ్మెల్ బాయ్స్', 'తుడరమ్' సినిమాలు మాత్రమే రూ.200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టాయి. ఇప్పుడు లేటెస్టుగా 'కొత్త లోక 1: చంద్ర' చిత్రం రెండు వందల కోట్లకు పైగా వసూలు చేసి, మాలీవుడ్‌లో అత్యధిక గ్రాస్ సాధించిన సినిమాల లిస్టులో 4వ స్థానానికి చేరుకుంది. అలానే ఈ ఏడాది హయ్యెస్ట్ కలెక్షన్స్ అందుకున్న మూడో మలయాళ చిత్రంగా నిలిచింది. ఈ వారం లోనూ మలయాళంలో 'లోకా చాప్టర్ 1: చంద్ర' సందడి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మరోసారి చిక్కుల్లో నయనతార.. మద్రాస్ హైకోర్టు నోటీసులు..



నయనతార జీవితంపై రూపొందిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' వివాదాల్లో చిక్కుకుంది. 'చంద్రముఖి' సినిమాలోని సన్నివేశాలను అనుమతి లేకుండా ఉపయోగించారని ఏబీ ఇంటర్నేషనల్ కోర్టును ఆశ్రయించింది. ఆ సన్నివేశాలు తొలగించాలని, లేదంటే రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, మద్రాస్ హైకోర్టు టార్క్ స్టూడియోస్ కు నోటీసులు జారీ చేసింది.

అగ్ర కథానాయిక నయనతార జీవితంపై 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ రూపొందిన సంగతి తెలిసిందే. గతేడాది నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ చేయబడిన ఈ డాక్యుమెంటరీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. అదే సమయంలో వివాదాలు కూడా చుట్టుముట్టాయి. అనుమతి లేకుండా తన సినిమాలోని ఫుటేజీ ఉపయోగించారంటూ అప్పట్లో ధనుష్ కోర్టు మెట్లు ఎక్కడం సంచలనంగా మారింది. అయితే డాక్యుమెంటరీ వచ్చిన పది నెలలు గడుస్తున్నా వివాదాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా నయన్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. 'చంద్రముఖి' సినిమాలోని కొన్ని సన్నివేశాలను అనుమతి లేకుండా నయనతార డాక్యుమెంటరీలో ఉపయోగించడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ ,యూవీ కాపీ రైట్స్ కలిగి ఉన్న ఏబీ ఇంటర్నేషనల్ అనే సంస్థ మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఆ సీన్స్ తొలగించాలని, లేదంటే రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినా ఇంకా తమ కంటెంట్‌తో డాక్యుమెంటరీ స్ట్రీమింగ్ అవుతూనే ఉందని ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్‌లో పేర్కొంది.

ఏబీ ఇంటర్నేషనల్ దాఖలు చేసిన పిటిషన్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. దీనిపై అక్టోబరు 6లోపు సమాధానమివ్వాలని డాక్యుమెంటరీని నిర్మించిన 'టార్క్ స్టూడియోస్'కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. 'చంద్రముఖి' ఫుటేజీని డాక్యుమెంటరీ నుంచి డిలీట్ చేయాలని, ఇప్పటివరకూ స్ట్రీమింగ్ ద్వారా ఎంత సంపాదించారో వివరాలు సమర్పించేలా ఆదేశించాలని ఏబీ ఇంటర్నేషనల్ కోర్టుని కోరింది.





# దుల్కర్ సల్మాన్‌కు జోడీగా..

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే దాదాపు మూడేళ్ల తర్వాత మళ్ళీ తెలుగు తెరపై మెరవనుంది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ DQ41లో పూజాహెగ్డే హీరోయిన్‌గా ఎంపికైంది. రవి నేలకుడిటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. చిత్ర యూనిట్ విడుదల చేసిన వీడియోలో పూజా, దుల్కర్ ల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం తెలుగుతో పాటు పలు భాషల్లో విడుదల కానుంది.

బుట్టబొమ్మ పూజా హెగ్డే తెలుగు తెరపై కనిపించి మూడేళ్లు దాటిపోయింది. అప్పట్లో కొన్నేళ్లపాటు టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా రాణించినకు ఈ బ్యూటీకి ఇటీవల కాకాలంలో తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి. తమిళ, చిత్రాల్లో మంచి ఆఫర్స్ వస్తున్నాయి కానీ, తెలుగులో మాత్రం చేతికొచ్చిన ప్రాజెక్ట్స్ కూడా వెనక్కి వెళ్లిపోతున్నాయి. ఇలాంటి టైంలో ఓ క్రేజీ మూవీలో పూజా హెగ్డే ఛాన్స్ కొట్టేశారు. ఓ పాన్ ఇండియా సినిమాలో దుల్కర్ సల్మాన్ కు జోడీగా కనిపించనున్నారు.

SLV సినిమాస్ బ్యానర్ లో దుల్కర్ సల్మాన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది ఆయన కెరీర్ లో 41వ చిత్రం. ప్రస్తుతానికి DQ41 అనే వర్కింగ్ టైటిల్ తో పిలుస్తున్నారు. చాలా రోజుల క్రితమే సెట్స్ మీదకు వెళ్లిన ఈ సినిమా.. సైలెంట్‌గా షూటింగ్ జరుపుకుంటోంది. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుందనే విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమెకు వెల్కమ్ చెబుతూ ఓ స్పెషల్ వీడియోని పంచుకున్నారు.

పూజా హెగ్డే షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలియజేస్తున్న ఈ మేకింగ్ వీడియో ఆకట్టుకుంటోంది. ఇందులో హీరో దుల్కర్ సల్మాన్ కూడా ఉన్నారు. పూజ స్కూటీ నడుపుతుండగా, దుల్కర్ ఆమె వెనుక కూర్చుని ఉన్నారు. ఈ సీన్ వారిద్దరి మధ్య మ్యాజికల్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తోంది. ఇద్దరూ తొలిసారిగా కలిసి నటిస్తున్నారు. స్క్రీన్ పై జంట అందంగా కనిపించింది. బ్యాగ్రౌండ్ లో వచ్చే మ్యూజిక్ కూడా బాగుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో DQ41 షూటింగ్ జరుగుతున్నట్లు ఈ వీడియో చూస్తే అర్థమవుతోంది. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి రవి నేలకుడిటి దర్శకత్వం వహిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అనయ్ ఓం గోస్వామి డీవోపీగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్నారు. పాన్ ఇండియా మూవీ గా రెడీ అవుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,